



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ఆదర్శ కమ్యూనిస్టు నరసింహయ్య

- వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత టి.నరసింహయ్య బాటలో అందరూ నడిచి ఉద్యమాలకు ఊపిరి పోయాలని టి.నరసింహయ్య చిన్న కుమారుడు టి.హరి సూచించారు. టి. నరసింహయ్య నాలుగో వర్ధంతి సభ బుధవారం కర్షక భవన్లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ప్రజానాట్యమండలి కళాకారులు ఆయనపై గేయాలను ఆలపించారు. వర్ధంతి సభకు సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా టి. నరసింహయ్య చిన్న కుమారుడు టి.హరి, మేనల్లుడు జంధ్యాల రఘుబాబు, సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శిడి గౌస్ దేశాయ్, సీనియర్ నాయకులు ఇ.పుల్లారెడ్డి, నగర కార్యదర్శి ఎం .రాజశేఖర్లు ఆయన చిత్రపటానికి పూలమాల వేసినివాళులు అర్పించారు. టి.హరి మాట్లాడుతూ టి. నరసింహయ్య నిరంతరం ప్రజల గురించి ఆలోచన చేస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం పరితపించే వారన్నారు. మీరంతా ఆయన ఆత్మీయ కుటుంబమని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు ఉత్తరాలు రాయడం, ఆత్మీయ పలకరిస్తూ సిపిఎం కార్యకర్తలుగా తయారుచేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. పంచ కట్టు సామాన్య దుస్తులు ధరిస్తూ అందరికీ ఆదర్శప్రాయుడయ్యాడన్నారు. మా అమ్మానాన్నలు దళితవాడల్లో వెళ్లి వారి చైతన్యం చేసేవారన్నారు. అన్ని రంగాల్లో మార్క్సిస్టులను తయారు చేశారన్నారు. ఆయన చూపిన బాటలో నడిచిన వ్యక్తులే కర్నూలు జిల్లా నుండి రాష్ట్ర నాయకులుగా ఎదిగారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఆది దంపతుల ను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ ఆయన ఎక్కువగా పుస్తకాలు అధ్యయనం చేసి బహిరంగ సభల్లో ఆద్యంతం గురించి చెప్పేవారన్నారు. అర్ధశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేశారన్నారు. ఎన్నో ఉద్యమాలు నడిపిన మహోన్నత వ్యక్తి అందరికీ ఆయన జీవితం ఆదర్శం అన్నారు. సీనియర్ నాయకులు ఇ. పుల్లారెడ్డి మాట్లాడుతూ భూస్వామ్య పెత్తందారులు పార్టీలో చీలిక చచ్చిన సమయంలో మార్క్సిస్టు పార్టీని నిలబెట్టిన మహోన్నత వ్యక్తి నరసింహయ్య అన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మనం మారి బహుళ వర్గ సంఘాలను ఏర్పాటు చేసినప్పుడే మనము ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి మాట్లాడుతూ ఆయన సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినప్పటికీ భూ పోరాటాలు చేసి కూలీల హక్కులను కాపాడారాన్నారు. 2009లో సిపిఎం ఓడిపోయిన సందర్భంలో ప్రజల పట్ల కోపం ఆక్రోషం ఉండరాదని తెలిపారని అన్నారు. కరువు సమయంలో గంజి కేంద్రాలు ఏర్పాటు చేసి అందర్నీ సమానంగా చూడాలని చెప్పారన్నారు. అర్థ శాస్త్రాన్ని చెబుతూ శ్రమ ద్వారానే వస్తువు విలువ పెరుగుతుందన్నారు. నేడు మనం ఎదుర్కొంటున్న సమస్య ఆనాడే నరసింహయ్య ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రస్తుతం ముస్లింలు, క్రైస్తవులు, హిందువుల మధ్య చీలికలు తెస్తూ రాజ్యాంగాన్ని మార్చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని చెప్పారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందిరిపైన ఉందన్నారు. 26న రాజ్యాంగం ఎదుర్కొనే సవాళ్లు గురించి సభ ఉంటుందని ఆ సభను విజయవంతం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె వి నారాయణ, సిపిఎం నాయకులు ఎం.గోపాల్,నరసింహయ్య తో ఉన్న సంబంధాలను గురించి తెలిపారు. ఆయన అడుగుజాడల్లో నడిచిన నాడే మనము ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.


నరసింహయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

- బాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందన
- నేరసమీక్షలో ఎస్పి సిద్ధార్థ కౌశల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సమస్యాత్మక గ్రామాలపై సాక్ష్యం ప్రభావిత గ్రామాలపై గట్టినిఘాను ఉంచాలని జిల్లా ఎస్పి సిద్ధార్థ కౌశల్ అన్నారు. బుధవారం స్ధానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని డిఎస్పి, సిఐలు, ఎస్ఐలతో జిల్లా ఎస్పి నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పి ఫ్యాక్షన్ గ్రామాల గురించి రివ్యూ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాలను సందర్శించాలన్నారు. పల్లెనిద్ర కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రస్తుత పరిస్ధితులలో తీసుకోవలసిన జాగ్రత్తలపై, పాత కేసుల గురించి ఆరా తీశారు. ఫీల్డ్ వర్క్ పైదృష్టి సారించాలన్నారు. పిటి ట్రయల్ కేసులలో శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డిఎస్పిలు, సిఐలు, ఎస్ఐలు, ముఖ్యమైన ట్రయల్ కేసుల్లో భాద్యతగా తీసుకోవాలన్నారు. గ్రామ సభలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల ప్రజలతో సత్సంబంధాలు పెంపోందించుకోవాలన్నారు. ఆయా గ్రామాల ప్రజల నుండి సమస్యల గురించి సమాచారాన్ని సేకరించాలన్నారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలించకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్స్‌కు కౌన్సిలింగ్ చేయాలన్నారు. కిరాయి హంతకులు, దొంగల ముఠా లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అక్రమ మైనింగ్, క్వారీస్, ఎక్స్ ప్లోజివ్స్ ట్రాన్స్ పోర్టు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలపాలు, ఒపెన్ డ్రింకింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసుస్టేషన్ల పరిధులలోని శివారు ప్రాంతాలలో పోలీసులు ఫీల్డులో విధులు నిర్వహించాలన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుండి జిల్లా సరిహద్దుల (బార్డర్)లో అక్రమ మద్యం రవాణా జరగకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే భాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలన్నారు. కర్నూలు, పత్తికొండ , ఆదోని సబ్ డివిజన్ లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న యుఐ కేసులు, గ్రేవ్ కేసులు, ఆస్తి నేరాల రికవరీ, పిఒసి, ఎస్ఒ కేసులు, ఎస్‌సి, ఎస్‌టి కేసుల పై జిల్లా ఎస్పి సమీక్షించారు. ఈ నేర సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పి అడ్మిన్ డి. ప్రసాద్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డిఎస్పిలు వెంకటాద్రి, వెంకట్రామయ్య, యుగంధర్‌బాబు, శ్రీనివాసులు, వినోద్ కుమార్, నాగభూషణం, మహేష్, సిఐలు , ఎస్ఐలు పాల్గొన్నారు.

నోటీసు ఇవ్వకుండా సమావేశాలా..?

- ఎమ్మెల్యేలకో న్యాయం... సర్పంచులకింకో న్యాయం
- మండల సర్వసభ్య సమావేశం పట్ల సర్పంచుల ఆగ్రహం
- సమావేశాన్ని బహిష్కరించి నిరసన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండల సర్వసభ్య సమావేశానికి సంబంధించి సభ్యులు సర్పంచులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సమావేశాలు నిర్వహిస్తారా అని పలువురు సర్పంచులు అన్నారు. కర్నూలు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో సర్పంచుల అసంతప్తులు, నిరసనలు నడుమ ముందుకు సాగింది. సర్వసభ్య సమావేశానికి సంబంధించి ప్రతిపక్ష సర్పంచులకు ఎలాంటి ముందస్తు సమాచారం నోటీసుల రూపంలో ఇవ్వకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షం బలపరిచిన సర్పంచులు సమావేశాన్ని బహిష్కరించి మండల పరిషత్తు కార్యాలయ ప్రాంగణంలో పాలక పక్షానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు బాలపీర, జయన్న,, ఎంపిటిసి లక్ష్మీదేవి, టిడిపి యువ నాయకులు బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ గత అనేక మండల పరిషత్తు సమావేశాల చరిత్రలో ఇలాంటి పోకడ ఎప్పుడు చోటు చేసుకో లేదని, సర్వసభ్య సమావేశానికి ముందుగా సర్పంచులకు సమావేశంలో తీర్మానించనున్న వివిధ అంశాల వివరాలను సమావేశ అజెండాను సర్పంచులకు విధిగా తెలియజేయాల్సి ఉందన్నారు. కోరం ఉంటేనే సమావేశాలు నిర్వహించాలని, గత సమావేశాలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ప్రస్తుత సమావేశంలో పరిష్కారం చూపాలని చట్టం చెబుతుందన్నారు. రెండేళ్ళ గడిచినా సర్పంచులకు కనీస గౌరవ వేతనాలు ప్రభుత్వం అందించకపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్యేలకు మాత్రం లక్షల రూపాయలు గౌరవ వేతనం క్రమం తప్పకుండా ఇవ్వటం సర్పంచుల వేతనాలను విస్మరించడం ఇదేమి న్యాయమని ప్రశ్నించారు. సభ్యులకు నోటీసు ఇవ్వకుండానే సమావేశాన్ని నిర్వహించడం గర్హనీయమన్నారు. గ్రామాభివృద్ధి కొరకు రూ. కోట్లల్లో పనులు చేసి బిల్లులు పెట్టి నెలలు గడుస్తున్నా అధికారపక్షం మంజూరు చేయకుండా సర్పంచులను వేధిస్తోందన్నారు. పంచాయతీల కోట్ల రూపాయల నిధులను దారి మళ్లించి ప్రభుత్వం ఖర్చు చేయడం పంచాయతీల హక్కులను కాలరాయడమే అవుతుందన్నారు. ప్రభుత్వం కళ్ళు తెరిచి సర్పంచుల హక్కులను పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు గిడ్డయ్య, ఈశ్వరయ్య, మాధవస్వామి, ఎంపిటిసిలు నాగరాజు, ప్రసన్న ,లక్ష్మీదేవి, టిడిపి నాయకులు శంకర్ నాయుడు పాల్గొన్నారు.


నిరసన చేపడుతున్న సర్పంచులు

రహదారి భద్రత వారోత్సవాలను జయప్రదం చేయండి

- కలెక్టర్ పి.కోటేశ్వర రావు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను జయప్రదం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన అనంతరం 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను, కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓర్వకల్ వద్ద అండర్ పాస్ నిర్మాణం కొరకు సంబంధించిన డిజైన్స్ తయారు చేశారని పిడి, నేషనల్ హైవే వారిని అడగగా పిడి నేషనల్ హైవే వారు స్పందిస్తూ అందుకు సంబంధించిన డిజైన్లు తయారు చేశామని, సంబంధించిన డిజైన్లను జిల్లా కలెక్టర్‌కు చూపిస్తూ వాటిని వివరించారు. అదే విధంగా నేషనల్ హైవే సమీపంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటు చేస్తున్నందున భవిష్యత్తులో సిక్స్‌లైన్ హైవేతో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంతోష్ నగర్ ఫ్లై ఓవర్ వద్ద ఇరువైపులా సర్వీస్ రోడ్లను మూసివేసి, అక్కడ ఉన్న స్పీడ్ బ్రేకర్లను తీసివేసి వైట్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే 40,44లో సంతోష్‌నగర్, నన్నూరుటోల్‌ప్లాజా , టోల్ గేట్ వద్ద హై మాస్ లైట్లు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులకు ఎక్కువ లైటింగ్ వల్ల ఇబ్బంది కలిగినట్లయితే ప్రత్యామ్నాయంగా సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ కాలేజీ, మద్దూర్‌నగర్, బళ్ళారి చౌరస్తా , రాజ్ విహార్ సర్కిల్ ప్రాంతాల్లో రోడ్ల విస్తరణకు సంబంధించి చర్యలు తీసుకోవాలని మునిసిపల్, ఆర్‌అండ్‌బి , ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా నగరంలో సిసి కెమెరాల మరమ్మతులు త్వరగా చేయాలని మునిసిపల్ కమిషనర్‌కు తెలిపారు. కొని ప్రదేశాలలో ఏర్పడిన గుంతలను త్వరితగతిన పూడ్చివేయాలని ఆర్‌అండ్‌బి ఎస్ఇని ఆదేశించారు. రాయలసీమ యూనివర్సిటీ నుండి నంద్యాల చెక్ పోస్ట్ వరకు అవసరం లేని స్పీడ్ బ్రేకర్లను తొలగించామని ఆర్‌అండ్‌బి ఎస్ఇ జిల్లా కలెక్టర్ కువివరించారు. 2022 నవంబర్ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భార్గవ తేజ, డెప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శ్రీధర్, ఎన్.హెచ్ 44 పిడి జెఎల్.మీనా తదితరులు పాల్గొన్నారు.



రహదారి భద్రత వారోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ట్రిపుల్ ఐటి డిఎంకు మౌలిక వసతులు

జగన్నాథ గట్టుపై ఉన్న ట్రిపుల్ ఐటి డిఎం విద్యా సంస్థకు సంబంధించిన మౌలిక వసతుల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ట్రిపుల్ ఐటి విద్యా సంస్థ మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ త్రిపుల్ ఐటిడిఎంకు అదనంగా భూమి కేటాయింపు చేసేందుకు ప్రభుత్వానికి అలియనేషన్ ప్రతిపాదనలు తయారు చేయాలని డిఆర్ఒను ఆదేశించారు. విద్యా సంస్థ భవన సముదాయం చుట్టూ చేపడుతున్న కాంపౌండ్ వాల్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బిఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారి44 నుంచి త్రిపుల్‌ఐటిడిఎంకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు అయ్యాయని టెండర్ కూడా వేశామని పేర్కొన్నారు, నీటి సరఫరా కొరకు నిర్మించే పైపులైన్లకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇని ఆదేశించారు. హై టెన్షన్ లైన్ తరలింపునకు సంబంధించి సర్వే, రెండు రోజుల్లో పూర్తి చేయాలని ట్రాన్స్‌పోర్టు అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ నాగేశ్వరరావు, ఆర్‌డిఒ హరి ప్రసాద్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ శ్రీధర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ఇ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో డాక్టర్ శంకర్ శర్మ

సాధన తోనే పతకాలు సాధ్యం

- డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

జిల్లా విల్లు విద్యా క్రీడాకారులు క్రమం తప్పకుండా సాధన చేస్తూ పతకాలు సాధించడం జిల్లాకే గర్వకారణమని ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. బుధవారం కర్నూలు అవుట్డోర్ స్టేడియంలో జనవరి 6 నుండి విజయవాడ కేంద్రంగా చెరుకూరి ఓల్గా స్మారక 5వ జాతీయ స్థాయి కిడ్స్ విల్లు విద్యపోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా కర్నూలు అవుట్డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ప్రముఖ డాక్టర్ శంకర్ శర్మ హాజరై క్రీడాకారులను సత్కరించారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ కర్నూలు జిల్లా క్రీడాకారులు రానున్న రోజుల్లో అనేక పోటీల్లో పాల్గొని మర్రిన్ని అవార్డులు తీసుకునేలా సాధన చేసి జిల్లాకే తలం మణికం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ప్రధాన శిక్షకులు నటరాజ రావు, జిల్లా విల్లు విద్యా సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య, శిక్షకులు వంశీకృష్ణ, బాలాజీ రెడ్డి
తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ర్యాంకులు సాధించిన క్రీడాకారుల వివరాలు: ఇండియన్ రౌండ్ విభాగంలో : బి.ఆద్య (35 వ రాంక్) ఎం.మనుశ్రీ (51 వ రాంక్), జె.హన్విత (62వ రాంక్),లాస్య శ్రీ (83 వ రాంక్), నవనీత్ (82 వ రాంక్), సాత్విక్ (72 వ రాంక్) లు సాధించారు.రిజర్వు విభాగంలో కె.హన్సికశ్రీ (40వ రాంక్), అద్వితీ (51 వ రాంక్), యోగాజ్ఞ (60 వ రాంక్), మహంతి (62 వ రాంక్), పార్ధ చంద్ర (69వ రాంక్)లు సాధించారు.

సచివాలయ మండలం కన్వీనర్‌గా హనుమంతు

ప్రజాశక్తి తుగ్గలి



సచివాలయాల మండల కన్వీనర్‌గా శభాష్ పురం సచివాలయం కన్వీనర్ హనుమంతను నియమిస్తూ రాష్ట్ర వైసిపి కన్వీనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన కర్నూలులో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల సచివాలయాల కన్వీనర్ హనుమంతు బుధవారం మాట్లాడుతూ పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ తమను మండల కన్వీనర్‌గా చేయడం ఆశించిన దగ్గర విషయం అన్నారు. పార్టీ నేతల సహకారంతో పార్టీ కోసం, సచివాలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. సచివాలయం మండల కన్వీనర్ హనుమంతు ఎంపిక పట్ల పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి


కర్నూలులో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

రక్త దానం , అన్నదానం చేసిన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 27 వ వర్ధంతి వేడుకలను బుధవారం కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రక్తదానం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలు, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాలలో ఘనంగా నిర్వహించారు. కల్లూరు అర్బన్ మాధవి నగర్ లోని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు గౌరు వెంకట రెడ్డి దంపతుల స్వగృహంలో నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదాన, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పాణ్యంనియోజకవర్గ పరిధి ఓర్వకల్లు,గడివేముల, పాణ్యం, కల్లూరు మండలాలు అర్బన్ పరిధి 16 వార్డుల నాయకులు, కార్యకర్తలు, యువకులు భారీ సంఖ్యలో స్వచ్ఛందంగా తరలి వచ్చి బ్లడ్ డొనేట్ చేశారు.

కర్నూలు కళాకారుల సేవా కేంద్రం ఆధ్వర్యంలో కర్నూలు నగరం నందలి ఎన్టీఆర్ కూడలిలో నందమూరి తారక రామారావు విగ్రహానికి నిలువెత్తు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు పార్టీ కార్యకర్తలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ ఇంచార్జి టి.జి.భరత్ తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విగ్రహానికి పూలమాల వేసి శ్రధాంజలి ఘటించి, నివాళులర్పించి స్మరించుకున్నారు. స్థానిక గౌరి గోపాల్ హాస్పిటల్ నందు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కార్యకర్తలు రక్తదానం చేశారు. కల్లూరు మండలం దొడ్డిపాడు గ్రామం లో ఎన్టీఆర్ చిత్రపటానికి గ్రామ నాయకులు పూలమాలవేసి నివాళులు అర్పించారు.


గూడూరులో నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

గూడూరులో

గూడూరు: కోట్ల టీం, తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో బుధవారం నాడు నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ముఖ్య అతిథులుగా కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్, మాజీ నీటి సంఘం అధ్యక్షులు చెట్టుకింద మద్దిలేటి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి సీనియర్ నాయకులు అయ్యవారి నాయుడు, మూలగేరి లక్ష్మన్న వాల్మీకి సంఘం అధ్యక్షులు మద్దిలేటి, వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు సంఘాల మధు, తెలుగు యువత ఉపాధ్యక్షులు వై.నాగరాజు, రైతు సంఘం కార్యదర్శి రేవుల గోవిందు, చెట్టుకింద నారాయణ పాల్గొన్నారు.



సి బెళగల్‌లో

సి బెళగల్ : బెళగల్ లోని ఎన్టీఆర్ పార్కులో ఆయన 27 వ వర్ధంతి సందర్భంగా మండలంలోనీ టిడిపి నాయకులు,కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు.మండల కన్వీనర్ గోవింద్ గౌడ్ మాట్లాడారు.


గౌరు వెంకట్‌రెడ్డి నివాసంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న కార్యకర్తలు



మాట్లాడుతున్న కెవి.నారాయణ

వలసలు ఆపాలి, ఉపాధి కల్పించాలి

24 న సచివాలయల ముందు ఆందోళనలు
వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లాలో వ్యవసాయ పనులు లేక, గ్రామీణ పేదలు సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, వలసలు ఆపి ఉపాధి హామీ పనులు కల్పించాలని గ్రామ సచివాలయాల ముందు ఈనెల 24న ఆందోళనలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ కోరారు. బుధవారంస్థానిక కార్మిక కర్షక భవనంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం, బి.వీరశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కెవి. నారాయణ మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ పనులు లేక, ఉపాధి హామీ పనులు లేక సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తూ ఉపాధిని పేదలకు దూరం చేసే లాగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవడం చాలా దారుణమని అన్నారు. పేదల కోసమే అని చెబుతూ నవరత్నాల పేరుతో నాలుగు డబ్బులు ఇవ్వడం తప్ప శాశ్వత ఉపాధి చూపించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. జిల్లా ఉపాధి హామీ అధికార యంత్రాంగం వలసలు అరికట్టేందుకు, పనులలో వచ్చిన మార్పులను పేదలకు తెలియజేసి ఉపాధి హామీ పనులకు వచ్చేలాగా చేయడంలో విఫలమవుతున్నారన్నారు. అందుకే పనులైనా చూపండి....తిండయినా పెట్టండి.. అంటూ సచివాలయాల ముందు ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, ఇ.తిక్కన్న, కె. వెంకట రాముడు, సహాయకార్యదర్శులు బి.బాలకృష్ణ, పి.సురేంద్ర, బి.నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి-సి బెళగల్



మండలంలోనీ తిమ్మందొడ్డి సంఘాల గ్రామాల నది తీరం వెంట బుధవారం రాత్రి బెళగల్ ఎస్ఐ పీరయ్య, పోలీస్ సిబ్బంది అక్రమ ఇసుకపై దాడులు చేపట్టారు. ఇందులో పలుకుదొడ్డికి చెందిన ట్రాక్టర్‌ను పట్టుకొని కేసునమోదు చేశారు. ఆ వ్యక్తి ప్రతి దినం చీకట్లో ఇసుక తరలించుకొని సొమ్ములు చేసుకుంటున్నట్లు తెలుసుకొని అదుపుల్లోకి తీసుకున్నట్లు మీడియాలో పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

సకాలంలో బస్సులు నడిపాలి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


కర్నూలు బస్ సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

సకాలంలో బస్సులు నడిపి ప్రయాణికుల మెప్పు పొందేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి సూచించారు. బుధవారం ఆదోని ఆర్‌టిసి బస్టాండ్‌లో బస్ సర్వీస్‌ను డిపో మేనేజర్ మహమ్మద్ రఫీక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో బస్సులు నడిపి సంస్థ పురోగతికి ఉద్యోగులు కృషి చేయాలన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్‌టిసిని ప్రభుత్వంలోకి విలీనం చేసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వారికి అండగా నిలిచారని తెలిపారు. గతంలో సకాలంలో జీతాలు రాని పరిస్థితి ఉండేదని చెప్పారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం వల్ల సకాలంలో జీతాలు చెల్లిస్తూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఇబ్బందులకు గురికాకుండా సకాలంలో బస్సులు నడిపి సంస్థ అభివృద్ధికి దోహదపడేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. డిపో మేనేజర్ మహ్మద్ రఫీక్ మాట్లాడుతూ... ప్రతి అరగంటకోసారి కర్నూలుకు బస్సు నడుపుతున్నామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన బస్సు సర్వీసు ఫోర్ సింగిల్ కర్నూలుకు నడుపుతామని తెలిపారు. ఉద్యోగులను సమన్వయం చేసుకుని ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తూ గమ్యం చేరుస్తున్నామని చెప్పారు.

'ఉపాధి'ని వినియోంచుకోవాలి

- డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా గ్రామంలోనే ఉపాధి పనులను చేసుకోవాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఉపాధి పనులను సర్పంచి అరుణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉపాధి దినసరి కూలి రూ.257 వస్తుందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబం 100 రోజులు పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం జగనన్న కాలనీని చూసి బాగా కట్టుకున్నారని హర్షం వ్యక్తం చేసారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, జగనన్న హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఎపిఎం కృష్ణమూర్తి, ఈసి రంగస్వామి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నం, ఉప సర్పంచి సులోచనమ్మ భర్త ఈరన్న, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, వైసిపి నాయుకులు చాప ఈరన్న, వాల్మీకి రాఘవేంద్ర, సీనియర్ మేటీ మధు, వైసిపి నాయుకులు నాగన్న, ఏసేపు, యు.పవన్ కుమార్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కెడిసిసి జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర

ప్రజాశక్తి - ఆస్పరి


మంత్రిని సన్మానిస్తున్న కెడిసిసి జిల్లా డైరెక్టర్ రాఘవేంద్ర

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కెడిసిసి జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర తెలిపారు. బుధవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, ఆయన సోదరుడు, మాళమల్లేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులును కుటుంబ సభ్యులతో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్నదాతలకు సేవ చేసి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. తన పదవి కాలాన్ని జులై 17 వరకు పొడిగించడంతో మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సహకార సంఘాలకు నిధులు మంజూరు చేయించి రైతులకు సకాలంలో రుణాలు అందేలా చూస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. సింగిల్‌విండో ఛైర్మన్ గోవర్ధన్, సర్పంచి మూలింటి రాధమ్మ, వార్డు సభ్యులు అలీ బాషా పాల్గొన్నారు.

ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం పెంచుకోవాలి

- ఆర్‌ఎంకె కోచింగ్ సెంటర్ యాజమాన్యం ఆశా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పోటీ పరీక్షల ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం పెంపొందించుకోవాలని ఆర్‌ఎంకె కోచింగ్ సెంటర్ యాజమాన్యం ఆశా, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, పట్టణ నాయకులు అజిత్ తెలిపారు. బుధవారం ఎస్ఐ, కానిస్టేబుల్ నమూనా పరీక్ష ఆర్‌ఎంకె కోచింగ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్హత కలిగిన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. నిరంతర విజ్ఞానార్జన, వ్యాయామం, విలువలతో కూడిన జీవితం, దినచర్యలో క్రమశిక్షణ ప్రాథమిక అవసరమని చెప్పారు. నిరుద్యోగుల ఉద్యోగాల కోసం డివైఎఫ్ఐ. చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. డివైఎఫ్ఐ నాయకులు అనిల్, వీరేంద్ర, ప్రవీణ్, అనిల్ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి - దేవనకొండ


గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు

రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యపడిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. బుధవారం మండలంలోని పాలకుర్తి, లక్కందిన్నె గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముందుగా పాలకుర్తి గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామ వాలంటీర్, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్కందిన్నె గ్రామంలో పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమీపంలో ఉన్న వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరగా... ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. వంతెన నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. మంత్రి సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు, సర్పంచి సుధారాణి, జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి భర్త ఉమాంబ, వైసిపి నాయకులు హంపిరెడ్డి, నిజాలురెడ్డి, ప్రేమ్ నాథ్ రెడ్డి, నారాయణరెడ్డి, రాజన్న, సత్యరాజు, ప్రతాప్, ప్రవీణ్, తిరుమలేష్ నాయుడు పాల్గొన్నారు.

క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రతి గ్రామంలోనూ క్రీడాకారులకు మైదానం ఏర్పాటు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ నాయకులు పరమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, తిక్కప్ప, కెజిబిఎస్ పట్టణ అధ్యక్షులు యువరాజు మాట్లాడారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు శ్రీకారం చుట్టాలని, దళిత కాలనీలో సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎంతోమంది విద్యార్థులు ఆటల పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికై గ్రామానికి మంచి పేరు తెచ్చారని తెలిపారు. సరైన సదుపాయాలు లేక యువకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే కెవిపిఎస్ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సంక్రాంతి పండగ సందర్భంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో మూడురోజులపాటు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. విన్నర్స్, రన్నర్స్‌కు బహుమతులు అందజేశారు. దళిత సమస్యలపై పోరాటమే కాకుండా క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మొదటి, రెండో బహుమతిని ఉలిగప్ప చేతులమీదుగా అందజేశారు. కెవిపిఎస్ గ్రామ కార్యదర్శి సిద్ధప్ప, కమిటీ సభ్యులు మహారాజ్, లాజూర్, భీమేష్, మధు, ఇమ్మానుయేల్, ఉరుకుంద, ఈరన్న, రామప్ప, తాయప్ప, ఎల్లప్ప, బంగారి, చిన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

నరసింహయ్య ఆశయాలు యువతకు ఆదర్శం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


నరసింహయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

తెలకపల్లి నరసింహయ్య ఆశయాలు నేటి యువతకు ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, నాయకులు రాముడు, లక్ష్మీ నరసయ్య, రవికుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో తెలకపల్లి నరసింహయ్య 4వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు అబ్దుల్లా, రాజు, వలీ, బి.రాజు, రామన్న, కృష్ణ, ఆంథోని, లక్ష్మన్న, వెంకటేశులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమ నేత నరసింహయ్య

ప్రజాశక్తి - ఆదోని

కర్నూలు జిల్లాలో సిపిఎం ఉద్యమ నిర్మాత నరసింహయ్య సేవలు చిరస్మరణీయమని సిపిఎం నాయకులు కొనియాడారు. బుధవారం పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో నరసింహయ్య 4వ వర్ధంతి సభ జరిగింది. నరసింహయ్య చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు మహానంద రెడ్డి, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా ఉద్యమ కార్యకర్తలకు ఉద్యమ అక్షరాలు దిద్దించి, సామాజిక ఆర్థిక పాఠాలు నేర్పి, కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దారని తెలిపారు. గార్గేయపురంలోని ఉన్నత సాంప్రదాయ కుటుంబానికి చెందిన తెలకపల్లి రామయ్య, సరస్వతమ్మ దంపతులకు 1928 జూన్ 8న జన్మించారని చెప్పారు. తుది శ్వాస వరకు ఎర్రజెండా పేదల పక్షాన ఉన్నారని తెలిపారు. సిపిఎం నాయకులు నాగరాజు, విజయ్, శ్రీనివాసులు, తిక్కప్ప పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. బుధవారం కోసిగిలోని 3వ గ్రామ సచివాలయ పరిధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు.


'గడపగడపకు' పాల్గొన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

సర్పంచి అయ్యమ్మ, వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పర్యటించారు. ముందుగా ఈశ్వర దేవాలయం నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు 6వ అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన నిర్వహించారు. మైనార్టీ కాలనీలో నాయకులు నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి టోపీ పెట్టి, శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు. తహశీల్దార్ రుద్రగౌడ్, ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ మనోజ్ కుమార్, ఎంఇఒ లక్ష్మినారాయణ, ఎఒ రాజు, ఎఇలు మల్లికార్జున రెడ్డి, పేక్షావలీ, వీరేష్, ఎపిఎం సత్యమ్మ, ఎపిఒ జయరాం, సూపర్‌వైజర్ సుధారాణి, ఎంపిపి ఈరన్న, నాడిగేని నరసింహులు, బెట్టనగౌడ్, మహంతేష్ స్వామి, నాడిగేని నాగరాజు, ఐరనగల్లు శ్రీనివాస రెడ్డి, జగదీష్ స్వామి, హాజీ ఉస్మాన్, మాణిక్య రాజు, నూర్ అహ్మద్, కోసిగయ్య, వి.వెంకటేష్, ఎల్లయ్య, జంపాపురం బసిరెడ్డి, కామనదొడ్డి నరసింహులు, వందగల్లు లక్ష్మయ్య, దొడ్డి నర్సన్న, జాకీర్, మహిళా నాయకులు, మాజీ ఎంపిపి భీమక్క, మాజీ జడ్‌పిటిసి మంగమ్మ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి వరం : ఎమ్మెల్యే

మంత్రాలయం : ముఖ్యమంత్రి సహాయ నిధి చికిత్స చేయించుకున్న పేదలకు ప్రభుత్వం అందించే చేయూత అని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని సుంకేశ్వరి గ్రామానికి చెందిన సోమిరెడ్డి గారి నర్సిరెడ్డి, రచ్చుమర్రి గ్రామానికి చెందిన కోసిగి సుజాతమ్మ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా నర్సిరెడ్డికి రూ.2.30 లక్షలు, సుజాతమ్మ రూ.17 వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. బాధితులు ఎమ్మెల్యేకు శాలువా, పూలమాల వేసి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచి ముక్కరన్న నాయకులు రఘునాథ్ రెడ్డి, ఆంజినేయ్య, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, అయ్యప్ప పాల్గొన్నారు.

గుంతలు తీసే కాటికాపరులను ప్రభుత్వ ఉద్యోగులుగా

- సచివాలయ అధికారికి కెజిబిఎస్ వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కాటికాపరి గుంతలు తీసే బేగరులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం పట్టణ అధ్యక్షులు యువరాజు కోరారు. బుధవారం పట్టణంలోని ఇంద్రనగర్ 17వ వార్డు సచివాలయంలో కాటికాపరుల సమస్యలపై సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాటికాపరులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ప్రభుత్వం తరఫున గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాటికాపరులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, మూడెకరాల భూమి ఇచ్చి, ప్రభుత్వం తరఫున ఇల్లు నిర్మించాలని కోరారు. నాయకులు వినోద్ కుమార్, హనుమంతు, బజారి, జయరామ్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుతో రైతుకు ప్రయోజనం : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం అందించే ప్రయోజనాలు అందుతాయని ఎఒ ఆనంద్ తెలిపారు. బుధవారం ఆయన చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు శనగ, జొన్న, పొద్దు తిరుగుడు పంటలు సాగు చేసిన రైతులు 13,153 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేసుకున్నారని తెలిపారు. నమోదు చేసుకోని రైతులుంటే ఈనెల 31 చివరి నాటికి తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే ప్రయోజనాలు అందలేదని వ్యవసాయ అధికారులను బాధ్యులను చేయడం మంచిది కాదన్నారు. ప్రతి గ్రామంలో కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా అవగాహన కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. ఎఇఒ రమాదేవి పాల్గొన్నారు.

ప్రతి మండలంలో 'ఫిష్ ఆంధ్ర' అవుట్‌లెట్లు

- డిఆర్‌డిఎ వైకెపి వెంకటసుబ్బయ్య




ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రతి మండలంలోనూ 'ఫిష్ ఆంధ్ర' అవుట్‌లెట్లను ఏర్పాటు చేయాలని పథక సంచాలకులు డిఆర్‌డిఎ-వైకెపి వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం స్థానిక మండల సమాఖ్య సమావేశ హాలులో ఆదోని, ఆలూరు నియోజకవర్గ ఎసి, ఎపిఎంలకు, లబ్ధిదారులకు 'ఫిష్ ఆంధ్ర' పథకంపై పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫిషరీస్ డిడి శ్యామల మాట్లాడారు. మండలానికి 5 చొప్పున ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లను ప్రారంభించాలని తెలిపారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా మొబైల్ బుక్ కీపింగ్, డిసిబి, సిఐఎఫ్ తదితర వాటిలో ప్రగతి సాధించాలని చెప్పారు. పెరటి కోళ్లు, గొర్రెలు, పొట్టేళ్ల యూనిట్ల లక్ష్యాన్ని నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని తెలిపారు. స్త్రీనిధి రికవరీని గడువులోపు పూర్తి చేయాలని, నిర్దేశించిన మండలాల్లో చేయూత మహిళ మార్ట్ ప్రారభించడానికి ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. ఏపీడీ శ్రీధర్ రావు పాల్గొన్నారు.

రాజకీయ ఉన్మాదిని తరమికొడదాం

- టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ - జిల్లావ్యాప్తంగా ఎన్‌టిఆర్ వర్ధంతి


ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న బీవీ


ఆలూరులో రక్తదానం చేస్తున్న రాజశేఖర్

ప్రజాశక్తి-ఆలూరు

స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రజలను హింసిస్తున్న రాజకీయ ఉన్మాదిని తరిమికొట్టేందుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సిద్ధంగా ఉండాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ కోరారు. బుధవారం టిడిపి వ్యవస్థాపకులు కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు వర్ధంతి సందర్భంగా ఆలూరు వాసవీ కల్యాణ మండపంలో సుజాతమ్మ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అంతకుముందు నాయకులు, కార్యకర్తలు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన విశ్వవిఖ్యాత, నటసార్వభౌముడు ఎన్‌టి.రామారావు అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ఉమ్మడి రాష్ట్రాన్ని, విడిపోయిన ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించిన నాయకుడు చంద్రబాబు అని తెలిపారు. నేడు రాజకీయ ఉన్మాది చేతిలో రాష్ట్ర పజలు నలిగిపోతున్నారని చెప్పారు. నియోజకవర్గ నలుమూలల నుంచి యువత, కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేసిన 75 మందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఉన్మాది చేతి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని కోరారు. టిడిపి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలాల నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, టిఎన్ఎస్ఎఫ్, నాయకులు సి.నారాయణరెడ్డి, ఎం.రాజశేఖర్, మీనాక్షి నాయుడు, కృష్ణమ నాయుడు, రఘురెడ్డి, అశోక్, వలీ బాష, భాస్కర్, నర్సప్ప, అరుణదేవి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు సుందర్ రాజు, కలీముల్లా, రంగస్వామి గౌడ్, మధు బాబు, తురేగల్ నజీర్ అహ్మద్, దయాసాగర్, కొండయ్య చౌదరి పాల్గొన్నారు. అలాగే కోట్ల క్యాంపు కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి.అల్తాఫ్, రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, అడ్వకేట్ కెటి.మల్లికార్జున, నాయకులు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాచాని శివకుమార్, మండల ఆత్మ మాజీ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, టిడిపి నందవరం మండల నాయకులు ముగతి వీరారెడ్డి, తెలుగు మహిళా నాయకులు అగ్రహారం పార్వతమ్మ, ఎమ్మిగనూరు టౌన్ వైడ్ ఎన్‌టిఆర్ అండ్ ఎన్‌బికె ఫ్యాన్స్ సేవా సమితి అధ్యక్షులు రోజా ఆర్ట్స్ ఉసేని, టిడిపి పట్టణ మైనార్టీ నాయకులు కెఎమ్‌డి.అబ్దుల్ జబ్బార్, మదిరే పీర్ బాషా, గోరా బాష, మేటీ వలీ బాషా, మహబూబ్ బాషా, ఆఫ్ఘన్ వలీ బాషా, టిడిపి ఎస్సీ సెల్ పట్టణ నాయకులు దర్జి మోషన్న, మాల మునిస్వామి, ఎస్.సాల్మన్, జాలవాడి ఏసన్న, వన్నెల మోష, గోనెగండ్ల మాజీ సర్పంచి బోయ రంగముని, పెద్ద మర్రివీడు మాజీ సర్పంచి దస్తగిరి, గంజహళ్లి పెద్ద లక్ష్మన్న, టిడిపి ఎమ్మిగనూరు మండల నాయకులు మాచుమాను దొడ్డి శ్రీనివాసులు, గుడికల్ కోలంట్ల నాగరాజు, పార్లపల్లి పాపా రాయుడు, కడివెల్ల ఉరుకుంద గౌడ్ శంకరన్న పాల్గొన్నారు. **ఆదోని** ప్రభుత్వాస్పత్రి నుంచి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ నిర్వహిస్తున్న సభలకు వస్తున్న ప్రజాదరణను చూసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హడలెత్తిపోతున్నారని తెలిపారు.

సీనియర్ అభిమానులకు సన్మానం : టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి.రామారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా సీనియర్ అభిమానులను సన్మానిస్తామని మీనాక్షి నాయుడు తెలిపారు. నియోజకవర్గంలో వంద మంది సీనియర్ ఎన్‌టిఆర్ అభిమానులను గుర్తించి వారికి మెమొంటో, శాలువా కప్పి అభినందిస్తామని చెప్పారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో బాలింతలకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. టిడిపి కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, కార్యదర్శి బుద్ధారెడ్డి, నాయకులు తిమ్మప్ప, అప్సర్ బాష, లక్ష్మీనారాయణ, అల్తాఫ్ హుస్సేన్, వాల్మీకి వెంకటేష్, రంగన్న, ఈరన్న, కాశీ, సాధికా బేగం, బాబు నాయుడు, రవి, మహబూబ్ బాషా, సజ్జత్, సుబ్బు, వీరేష్ ఉన్నారు. **ఆదోని** టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మదిరే భాస్కర్ రెడ్డి, ముస్లిం పట్టణ నాయకులు సౌదీ రవూఫ్, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, ఆత్మ మాజీ ఛైర్మన్ సాంబంగల్ ఫక్రుద్దీన్, ఎల్‌ఎల్‌సి మాజీ ఛైర్మన్ రామస్వామి, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, సుధాకర్ పాల్గొన్నారు. **చిప్పగిరి**లో టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. టిడిపి కన్వీనర్ రాయచూరు షేక్షావలీ రక్తదానం చేశారు. మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, మాజీ టిడిపి కన్వీనర్ కిష్టప్ప, టిడిపి సీనియర్ నాయకులు తిమ్మయ్య, బెల్డోన గోవిందు, మిరపకాయల చంద్ర, నరసింహులు పాల్గొన్నారు. **నందవరం**లోని టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్, తెలుగు రైతు మాజీ అధ్యక్షులు పెద్దరాముడు, టిడిపి నాయకులు వీరేష్, రెహ్మాన్, విశ్వనాథ్, మల్లి, ఈషా, తిమ్మప్ప, ఈరన్న పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలో ఎన్‌టిఆర్ వర్ధంతిని పోటాపోటీగా నిర్వహించారు. కౌతాళంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, ఉరుకుంద ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ శివ మోహన్ రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర జిల్లా కార్యదర్శులు అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు, టిప్పు సుల్తాన్, కొట్రేష్ గౌడ్, కురుగోడు, రాజానందు, రమేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, దొడ్డన గౌడ్, నబీసాబ్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని గోతులదొడ్డి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు, మండల కన్వీనర్ ఉల్లిగయ్య ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, నీలకంఠ రెడ్డి, సిద్ధప్ప, రామలింగ, కాత్రికి మాజీ సర్పంచి చంద్ర, గోవిందు, అబ్దుల్ రెహ్మాన్, కృష్ణ పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)**లోని స్టేట్ బ్యాంక్ దగ్గర ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి జెండాను ఆవిష్కరించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ జ్ఞానేష్, టిడిపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాడిగేని అయ్యన్న, నాడిగేని రంగన్న, కొండగేని వీరారెడ్డి, సాతనూరు కోసిగయ్య, వడ్డే రామయ్య, నాడిగేని వీరారెడ్డి, లక్ష్మీకాంత్, గోపాల్, డీలర్ నరసన్న, ఈరయ్య, వక్రాని వెంకటేష్, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి ఉమర్, ఖలందర్, ఉసేని, గౌస్, చిన్న భూంపల్లి మాజీ సర్పంచి నరసింహులు, జంపాపురం మాజీ సర్పంచి కృష్ణారెడ్డి, పల్లెపాడు మాజీ సర్పంచి చంద్ర, బెళగల్ సర్పంచి రామయ్య, ఐ టిడిపి అధ్యక్షులు సల్మాన్ రాజు, భూంపల్లి నీలకంఠ, దుద్ది నాగేష్, అగసునూరు అంజినిరెడ్డి, కోసిగి హనుమంతు, ఐరన్ గల్ బసవరాజు, పెద్ద భూంపల్లి హనుమంతు, జుమ్మాలదిన్నె గోవిందు పాల్గొన్నారు. అలాగే కోసిగయ్య ఆవరణం పక్కన మోరిపై ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి బీసీ నాయకులు, కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, సీనియర్ నాయకులు రామిరెడ్డి, టిడిపి టౌన్ అధ్యక్షులు నర్సిరెడ్డి, టిడిపి నాయకులు రణతిక్కన్న, పులుసు శివన్న, సొట్టయ్య, గాలం వీరేష్, నారాయణ, పోతుల తిక్కన్న, పోతుల నాగరాజు, పోతుల వీరారెడ్డి, శంకరయ్య, పల్లెపాడు బుజ్జి, వీరేష్, జుమ్మాలదిన్నె ఎంపిటిసి హనుమంతు, మైనార్టీ నాయకులు ఖలందర్ బాష, ఫారూఖ్, అబ్దుల్ బాష, కరీముల్లా, ఇస్మాయిల్ పాల్గొన్నారు. **దేవనకొండ**, తెర్నేకల్ గ్రామంలో వేర్వేరుగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు బడి గింజల రంగన్న, ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, సర్పంచులు భాస్కర్, రామప్ప, నాయకులు మలకన్న, మల్లయ్య, బండ్లయ్య, రాజాసాహెబ్, వెంకటస్వామి గౌడ్, తెర్నేకల్ దాసరి లతీఫ్, వెంకట్ రెడ్డి, చిన్న రాముడు, తిమ్మప్ప, నాగేష్ పాల్గొన్నారు.




ఆదోనిలో


నందవరంలో


చిప్పగిరిలో రక్తదానం చేస్తున్న షేక్షావలీ


కోసిగిలో మాట్లాడుతున్న పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి




కౌతాళంలో



మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత

- సర్పంచి ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామంలో మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నామని సర్పంచి ప్రేమ్ కుమార్ తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో నేమకల్లు గ్రామం నుంచి మజరా గ్రామమైన సంగాలకు వెళ్లే రహదారికి చేపడుతున్న మరమ్మతు పనులను సర్పంచి ప్రేమ్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా, మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రహదారి మరమ్మత్తు పనులను పంచాయతీ నిధుల ద్వారా చేయిస్తున్నామన్నారు. మంత్రి జయరాం సహకారంతో త్వరలోనే రాంపురమయ్య వీధి సిసి రోడ్డు పనులను మొదలు పెడతామన్నారు. సచివాలయ కన్వీనర్ గిరి, వైసిపి నాయకులు మోహన్ పాల్గొన్నారు.

సచివాలయంలో సబ్ కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని మండగిరి-2 గ్రామ సచివాలయాన్ని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. సచివాలయ సర్వీసులు పెండింగ్‌లో ఉండకూడదన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ మూవ్‌మెంట్ రిజిస్టర్, పలు రికార్డులను పరిశీలించారు. పరిపాలన అధికారి గోవింద్ సింగ్ ఎంపిడిఒ గీత వాణి పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్



రాయలసీమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

ప్రజాశక్తి - శిరివెళ్ల

కరువు, వలసల పీడిత ప్రాంతమైన రాయలసీమ న్యాయమైన డిమాండ్స్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చాలని, నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై తీగల వంతెన బదులు బ్యారేజ్ కం వంతెన నిర్మించాలని మాజీ జడ్‌పిటిసి యామ గుర్రప్ప, రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు యం.వి.రమణారెడ్డిలు కోరారు. బుధవారం శిరివెళ్లలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ–ఆంధ్రప్రదేశ్‌ను కలుపుతూ నాలుగులైన్ల 167కె జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై సుమారు రూ.1100 కోట్లతో ఐకానిక్ (తీగల) వంతెన చేపడుతుందని తెలిపారు. తీగల వంతెన వల్ల రాయలసీమకు ఎలాంటి ఉపయోగం లేదని, బ్యారేజ్ కం వంతెన నిర్మిస్తే కరువును తరిమికొట్టేందుకు సాగు, తాగు నీరు రాయలసీమకు అందుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28న జరిగే చలో సిద్దేశ్వరం ప్రజా ప్రదర్శనకు రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపిటిసి కె.బాలచంద్రుడు, రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెల్ సెక్రటరీ ఎంఎండి.ఇస్మాయిల్, రైతు నాయకులు చల్లా గోపాల్, ఎస్‌ఏ మాలిబాష, ఉల్లి తిరుపాల్, పిపి లింగమయ్య, తమ్మినేని రాజగోపాల్ రెడ్డి, వనివేటి లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎస్‌సి వర్గీకరణకు వెంటనే చట్టబద్ధత కల్పించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నంద్యాల జిల్లా కన్వీనర్ శివ నారాయణ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి సీనియర్ నాయకులు పెద్దమునయ్య మాదిగ, ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు కత్తి ఓబులేసు మాదిగ, నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు

జగనన్న ఇండ్లను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్లలోని కస్తూరిబా స్కూల్ సమీపంలో నిర్మిస్తున్న జగనన్న ఇండ్లను ఎంపిడిఓ సుబ్బరాజు, తహశీల్దార్ ధోని ఆల్ ఫ్రైడ్‌లు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచి శివ రాముడు, ఇఒఆర్‌డి తాహిర్ హుస్సేన్, హౌసింగ్ ఏఈ మద్దిలేటి, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ సురేంద్ర, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయ పాల డైరీలో ఫిల్లింగ్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్ ప్రారంభం



ఫిల్లింగ్, కోల్డ్ స్టోరేజ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల పట్టణ సమీపంలో ఉన్న విజయ పాల డైరీలో ఫిల్లింగ్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్‌లను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో విజయ పాల డైరీ చాలా అధ్వాన స్థితిలో ఉండేదని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని నంద్యాల విజయ పాల డైరీ కొత్త పాలకమండలిని ఏర్పాటు చేసిన తర్వాత దాదాపు 10 కోట్ల రూపాయలు బోనస్ ఇచ్చారన్నారు. రూ. 20 కోట్లతో కొత్త మిషనరీ, 70,000 లీటర్లు ఉన్న పక్రిమెంట్ లక్స్ లెటర్లకు చేయడం ఎంతో సంతోషకరమన్నారు.

పద్మశాలి సంఘం వారికి శ్రీముఖం అందజేత

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవంలో (మార్చి 4, 5న) జరిగే కల్యాణోత్సవానికి పద్మశాలి సంఘం వారిచే ఎన్నుకోబడిన సంఘ సభ్యులైన ఇద్దరు దంపతులు ఉభయదారులుగా వ్యహరిస్తారు. అహోబిల మఠం పీఠాధిపతి తన ముద్రకర్త అయిన వేణుగోపాలాచార్యులు శ్రీముఖంను అహోబిల పద్మశాలీయ సంఘం గౌరవాధ్యక్షులు గాజుల రామచంద్రుడు, అధ్యక్షులు పబ్బు తులసి కృష్ణలకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కట్టా రామకృష్ణ, ఉపాధ్యక్షులు అవ్వారు బాలాజీ, జానపాటి పెద్ద సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి అవ్వారు మల్లికార్జున, కోశాధికారి సేపూరి సుబ్బరామయ్య, సభ్యులు శిరసాల నాగేశ్వరరావు, సుబ్బరాయుడు, మేనేజర్ బిజ్జా శివ, ఉప్పల ప్రసాద్ పాల్గొన్నారు.



శ్రీముఖం అందజేస్తున్న దృశ్యం

ఉపాధి పనుల కల్పనకు సర్వం సిద్ధం : ఎపిడి

ప్రజాశక్తి - మహానంది

ఉపాధి పనులు కల్పించడానికి సర్వం సిద్ధంగా ఉన్నట్లు నంద్యాల క్లస్టర్ ఏపీడి బాలాజీ నాయక్ బుధవారం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు, రైతులకు ఉపయోగపడేలా ఉపాధి పనులను చేయించనున్నట్లు తెలిపారు. పండ్ల తోటల పెంపకంనకు సంబంధించి ఒక ఎకరాకు మొక్కలు నాటుకోవడానికి అనుమతిస్తామని, దానిని అభివృద్ధి చేయడానికి కూడా విడతలవారీగా కూలీలతోపాటు కొంత మొత్తాన్ని అందజేస్తామన్నారు. మల్లెతోట, మునగ, డ్రాగన్ ఫ్రూట్స్, ఇతర కొన్ని పంటలకు ఇలాంటి సౌకర్యం ఉంటుందని తెలిపారు. చెరువులు, వ్యవసాయ బావుల్లో పూడికతీత పనులు కూడా అమలు చేస్తున్నామని చెప్పారు. పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి కూడా ఉపాధి కూలీల ద్వారా చేయటానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని



వినియోగించుకోవాలని సమీపంలోని సిబ్బందితో కానీ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో కానీ పనులకు సంబంధించి వివరాలు నమోదు చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మనోహర్, ప్లాంట్ సూపర్వైజర్ వెంకట సుబ్బయ్య, ఆయా గ్రామాల సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

- ఎంపిడిఓ మధుసూదన రెడ్డి

ప్రజాశక్తి - రుద్రవరం

సచివాలయాల సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఎంపిడిఓ మధుసూదన రెడ్డి, ఇఒపిఆర్‌డి భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం రుద్రవరంలోని 1, 2, 3వ సచివాలయాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్లు వారంలో మూడుసార్లు బయోమెట్రిక్ హాజరు వెయ్యాలని సూచించారు. ఈ సర్వీసులు, సచివాలయం మిగతా విషయాలపై తగు సూచనలు జారీ చేశారు. ఇంటి పన్నులు, లైసెన్సులు, పంచాయతీ బకాయిలను త్వరగా వసూలు చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు మహమ్మద్ రఫీ, అరవింద నాయక్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదన రెడ్డి, ఈవోపీఆర్ డి భాగ్యలక్ష్మి



స్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసిల్దార్ వెంకట శివ, సిబ్బంది

ఎల్లావత్తులలో స్మశాన స్థలం కేటాయింపు

రుద్రవరం : మండలంలోని ఎల్లవత్తుల గ్రామంలో స్మశానానికి స్థలాన్ని కేటాయించినట్లు తహశీల్దార్ వెంకట శివ తెలిపారు. గురువారం ఆయన సిబ్బందితో కలిసి గ్రామ సమీపంలోని 106 సర్వే నెంబర్‌లో గల 0.30 ఎకరాల భూమిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వర్గాల వారికి అనుకూలంగా ఉన్న ఈ భూమిలో కంప చెట్లను తొలగించి శుభ్రంగా చేయించాలని అధికారులకు సూచించారు. ఆ తర్వాత భూమిని కొలతలు వేయించి గ్రామస్తులకు స్మశానానికి ఇవ్వనున్నట్లు చెప్పారు. విఆర్వోలు వెంకట నారాయణ, మల్లేశప్ప, రెవెన్యూ సిబ్బంది, విఆర్‌ఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోరుబాట గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - రుద్రవరం

సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట గోడపత్రికలను సిపిఐ ఆళ్లగడ్డ కార్యదర్శి భాస్కర్, రుద్రవరం మండల కార్యదర్శి బాల నరసింహులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఇంటి నిర్మాణానికి ఇస్తున్న లక్ష 80 వేల రూపాయలను ఐదు లక్షలకు పెంచాలని, జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. **మహానంది :** పోరుబాట వాల్ పోస్టర్లను సిపిఐ మండల కార్యదర్శి వీరప్ప, సహాయ కార్యదర్శులు మహేశ్వరమ్మ, గురుమూర్తి, మద్దమ్మ, శ్రీనగరం శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఫిబ్రవరి 6వ తేదీ కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు

మహానంది : మండలంలోని యం.తిమ్మాపురం, అబ్బిపురం గ్రామాలలో బుధవారం విద్యుత్తు విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న పలువురు వినియోగదారులపై కేసులు నమోదు చేశారు.

ఘనంగా బిసి ఇందిరా పుట్టిన రోజు వేడుకలు

బనగానపల్లె : మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా పుట్టిన రోజు వేడుకలను టిడిపి నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేశారు. వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, వార్డు మెంబర్ హర్షద్, హాజీ, అన్ను, ఖాజా, షేక్షా, కార్యకర్తలు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ట్రిపుల్ ఐటిడిఎంలోఫుడ్ పాయిజన్..

-26 మంది విద్యార్థులు అస్వస్థత ?
విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి
విద్యార్థి ప్రజా సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని జగన్నాథ గట్టు పై ఉన్న ట్రిబుల్ ఐటిడిఎంలో లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థకు గురయ్యారు. అక్కడున్నటువంటి క్యాంటీన్‌లో ఉన్న ఆహారాన్ని తీసుకున్న విద్యార్థులు 26 మంది తీవ్ర అస్వస్థకు గురయ్యారు. వీరిని వెంటనే వైద్యం అందించేందుకు ఉన్నతాధికారులు అక్కడే వారి ప్రాథమిక వైద్యం అందిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని బయటకి రానీయకుండా ఉన్నతాధికారులు అక్కడున్నటువంటి అధ్యాపకులను బోధనతర సిబ్బందికి సెక్యూరిటీ గార్డ్సుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో తెలుగు నాడు స్టూడెంట్ యూనియన్ టీఎన్ఎస్ఎఫ్, బిసి సెల్ నేతలు విద్యా సంస్థ దగ్గరకు వెళ్ళారు. ఫుడ్ పాయిజన్ అయి 26 మంది విద్యార్థులు అస్వస్థత కు గురైనట్టు తమ దృష్టికి వచ్చినట్టు రిజిస్ట్రార్ గురుమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. అలాంటి ఘటన ఇక్కడ జరగలేదని అన్నారు. అలాంటిది జరిగి ఉంటే కనుకుంటా నని నేతల చెప్పారు. హాస్టల్ లోకి వెళ్ళడానికి నేతలు ప్రయత్నించారు. కానీ సెక్యూరిటీ అనుమతించక పోవడం అనేక అనుమానాలకు తావిస్తుంది. ఫుడ్ పాయిజన్ జరగనప్పుడు తమను లోపలికి ఎందుకు అనుమతించడం లేదని అనుమానాలు వ్యక్తం చేశారు. కల్తీ ఆహారం వడ్డించడం వల్ల ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైనట్టు తమ దృష్టికి వచ్చిందని, ప్రచార మాధ్యమాల్లో కూడా వైరల్ అవుతోందని చెప్పారు. కానీ అధికారులు మాత్రం ఎలాంటి ఘటన జరగలేదని చెబుతూనే లోపలికి ఎందుకు అనుమతించడం లేదని సెక్యూరిటీని నిలదీశారు. అయితే ఈ సంఘటనపై ఉన్నతాధికారులు ఎలాంటి స్పందన లేకపోవడం కొసమెరుపు.

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలను అందించాలి:

ట్రిపుల్ ఐటిడిఎంలో ఫుడ్ పాయిజన్ అయి 26 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థత కు గురైనట్టు ప్రచార మాధ్యమాల్లో వచ్చిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ,టిడిపి బిసి.సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజు యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డిపోగు బజారన్న ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కె.బలరాం బుధవారం వేరువేరుగా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటిడిఎంలో విద్యార్థులు నాసిరకమైన భోజనం చేసి 26 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారికి హాస్పిటల్‌లో వైద్య సదుపాయాలు అందించకుండా కళాశాలలోనే వైద్యం అందిస్తున్నట్టు తెలుస్తోందన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ట్రిపుల్ ఐటిడిఎం సందర్శించిన వారిలో టిఎన్ఎస్ఫ్ నంద్యాల పార్లమెంట్ నాయకులు దినేష్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ వేధింపులకు అడ్డుకట్ట వేయండి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కెవిఆర్ జూనియర్ కళాశాల విద్యార్థుల పట్ల కెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ వేధింపులను అరికట్టాలని జూనియర్ కళాశాల బోధన సిబ్బంది కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న జూనియర్ కళాశాల స్థల వివాదం గురించి, నాడు నేడు పనులు గురించి చర్చించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, జూనియర్ కళాశాల విద్యార్థులను అధ్యాపకుల్ని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఎంపి మాట్లాడుతూ గతంలో నేను ఒక ఎంపీగా కళాశాలను పరిశీలించి వీలైనంత త్వరగా కోర్టు ఆదేశాలు, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశాలను అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఉన్నారన్నారు. ఈ విషయమై విద్యాశాఖ మంత్రి, ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ స్పందించారు. కోటి రూపాయల నాడు నేడు కార్యక్రమాలను కూడా అడ్డు చెబుతున్న డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తున్నదని ఎంపీ విచారం వ్యక్తపరిచారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జూనియర్ కళాశాలలో కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఉండాలని ముఖ్యమంత్రి రూ. వేలకోట్లు ఖర్చు పెడుతున్నారని, ఇటువంటి అధికారుల బాధ్యతా రహిత ప్రవర్తన వలన సమాజానికి, పేద విద్యార్థులకు ద్రోహం జరుగుతోందన్నారు. విద్యార్థుల జీవితాలు నాశనం చేయొద్దని కచ్చితంగా ఈ సమస్య పరిష్కారం కోసం విద్యాశాఖ మంత్రి దష్టికి తీసుకెళ్తానని త్వరలోనే ఈ సమస్య పరిష్కారం చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

ప్రగతి పథంలో జగనన్న పాలన : ఎంఏ హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జగనన్న పాలనలో రాష్ట్ర ప్రగతి పతంలో పయనిస్తోందని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. బుధవారం ఆయన కర్నూలు నగరంలోని 10వ వార్డు 24వ సచివాలయం సకల్ గేరి, మండి బజార్, గౌలిగిరి, పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బుధవారం ఆయన కర్నూలు నగరం పదవ వార్డులో ప్రతి గడప వద్దకు సంక్షేమం నడుచుకుంటూ వస్తోందని అన్నారు. వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి కూడా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలు చెప్పడం తనకు సంతోషాన్ని కలిగించిందన్నారు. ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాకపోతే వారికి ఇప్పించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు 10వ వార్డు కార్పొరేటర్ యూనుస్ బాషా, డాక్టర్ రేహన్ అలీఖాన్, పర్వేజ్ ఖాన్, నజీర్ అలీఖాన్, నూరుల్లాహ్ ఖాద్రి సాహెబ్, సోహైల్ బాబా, షోయబుద్దీన్ ఖాద్రి, షబ్బీర్‌ఖాన్ స్థానిక వార్డు నాయకులు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



డివైఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోలీస్ మోడడల్ పరీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోటీ పరీక్షల నిపుణులు కెఎస్. లక్ష్మణరావు పర్యవేక్షణలో రాష్ట్రస్థాయి పోలీస్ కానిస్టేబుల్ నమూనా పరీక్షను నిర్వహించారు. కర్నూలు నగరంలోని ఎస్‌విఆర్, విజేత స్టడీ సర్కిల్, ప్రదీప్ అకాడమీ, ఎమ్మిగనూరులో పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర నగేష్, విజేత అధినేత గోవిందు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్పా అబ్దుల్లా జెవివి నగర కార్యదర్శి తిమ్మప్పలు ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డివైఎఫ్ఐ నిరుద్యోగుల సమస్యల కోసం నిరంతరం పోరాడుతూనే పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థుల్లోని భయం తొలగించడానికి నాలుగు రోజుల ముందు ఇలాంటి మోడల్ ఎగ్జామ్ రాయడం ద్వారా అభ్యర్థులు మైన్ ఎగ్జామ్‌లో తప్పులు దొరలకుండా సరి చేసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో జరుగుతున్న మోడల్ పరీక్షలో టాప్ త్రీ అభ్యర్థులను ప్రముఖుల చేత అభినందిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాషా, నాయకులు మధు, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అమర్ తదితరులు పాల్గొన్నారు.



మోడల్ పరీక్ష పేపర్ విడుదల చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

జగనన్నను మరో మారు దీవించుడి : ఎమ్మెల్యే సుధాకర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి జగనన్నను మరొకసారి దీవించి అధికారాన్ని ప్రసాదించాలని కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం కర్నూలు మండలం, దిగువపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆయన స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యేకు స్థానిక వైసిపి నాయకులు కార్యకర్తలు కుంకుమ బొట్టుపెట్టి, ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే దిగువపాడు గ్రామంలోని ప్రజలను ఆప్యాయతంగా పలకరిస్తూ, లబ్ధి పొందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్స్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థతో ఇళ్ల వద్దకే పథకాలు వచ్చేలా జగనన్న పాలన సాగుతోందని అన్నారు. జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకు సంక్షేమ పథకాలు ఆగవని తెలిపి, జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రిని జగనన్నను మరొక్కమారు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నెహెమ్యా, సర్పంచి కట్టు సౌభాగ్య లక్ష్మి, ఎంపిటిసి కృష్ణవేణి, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మెంబర్



రవిశాస్త్రి, సర్పంచులు వెంకటేష్, ఏసేపు, దస్తగిరి, భద్రారెడ్డి, గోపాల్ రెడ్డి, చంద్రారెడ్డి, సుదర్శన్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, వెంకటరాముడు, భాషా, బాలు, నందనపల్లి వెంకటేష్, ఎంపిటిసి సురేష్, శివుడు, మండల అధికారులు సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు



కానిస్టేబుల్ రమేష్‌ను అభినందిస్తున్న ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్

పిసి రమేష్‌కు వీక్లీ బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న, కానిస్టేబుల్ రమేష్, జిల్లా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ చేతులమీదుగా, వీక్లీ బెస్ట్‌ఫెర్ఫార్మన్స్ అవార్డు అందుకున్నారు. డిసెంబర్ నెలలో కోడుమూరు లోని పాత బస్టాప్ దగ్గర నిలబడిన ఉన్న వ్యక్తి దగ్గర నుండి బ్యాగ్‌లో రూ. 4,10,000 ఒక వ్యక్తి నుంచి దొంగలించారు. కోడుమూరు సిఐఆఫీసులో రైటర్‌గా పని చేస్తున్న పిసి రమేష్ సమాచారం రాగా వెంటనే రమేష్ దొంగతనం చేసిన వ్యక్తి సమాచారం సేకరించి, అక్కడ వున్న సిసి టివి ఫుటేజ్ ల ద్వారా నిర్ధారణ చేసుకొని, ఆ విషయం ను వెంటనే ఎస్ఐ కోడుమూరుకు తెలిపి, సిబ్బందితో కలిసి దొంగ ఇంటిని రైడ్ చేసి ఆ దొంగ ఎత్తుకెళ్లిన రూ. 4,10,000 ను స్వాధీనం చేసుకొని ముద్దాయిలను అరెస్ట్ చేసారన్నారు. అతి తక్కువ టైమ్ లో కేసు ను చేదించి, పోయిన మొత్తం డబ్బు ను రికవరీ చెయ్యటం పిసి రమేష్ పాత్రను గుర్తించి, బుధవారం జరిగిన క్రైం మీటింగ్‌లో బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ ఆఫ్‌ది వీక్ అవార్డును,జిల్లాలో పని చేస్తున్న డిఎస్‌పి, సిఐ,ఎస్ఐల సమక్షంలో ఇచ్చారు. పిసి రమేష్‌ను జిల్లా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ ప్రత్యేకంగా అభినందించారు. కర్నూలు కానిస్టేబుల్ మహేష్, కోడుమూరు సిఐ శ్రీధర్, కోడుమూరు ఎస్ఐ విష్ణు నారాయణ అభినందించారు.



భిక్ష వడ్డిస్తున్న టిజి.భరత్

శివస్వాములకు టిజి భరత్ భిక్ష

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని పాతబస్టాండులో ఉన్న శ్రీశైలం దేవస్థానంలో శివస్వాములకు అన్నదాన కార్యక్రమంలో కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జీ టిజి భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివ స్వాములకు భిక్ష వడ్డించారు. అనంతరం టిజి భరత్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా శివ స్వాములకు భిక్ష పెట్టడం గొప్ప విషయమన్నారు. తమ టీజీవి సంస్థల తరుపున కూడా శివ స్వాముల అన్నదానం కోసం 20 రోజులకు సరిపడా బియ్యంతో పాటు ఇతర సరుకులను అందజేస్తున్నట్లు భరత్ తెలిపారు. రూ. 40 వేలు విలువైన బియ్యం అన్నదానం కోసం విరాళం ఇచ్చిన టిజి భరత్ కు నిర్వాహకులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు, ఆలయ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గురువారం 19 జనవరి 2023
5
నంద్యాల





పోలీస్ కానిస్టేబుల్ నమూనా పరీక్ష ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న డిఎస్‌పి రామాంజనేయులు

టి.నరసింహయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - నంద్యాల

కర్నూలు జిల్లా సిపిఎం ఉద్యమ నిర్మాత టి.నరసింహయ్య ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని టి.నరసింహయ్య భవన్లో టి. నరసింహయ్య 4వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు దర్శనం లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. సీనియర్ నాయకులు తోట మద్దులు, జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్‌లు టి.నరసింహయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ టి.నరసింహయ్య జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడి జిల్లా సిపిఎం ఉద్యమంలో చెరగని ముద్ర వేశారని తెలిపారు. ప్రజలతో నిత్య సంబంధాలను ఏర్పరచుకుని ప్రతి నియోజక వర్గంలో యువకులను తన కొడుకులా చూసుకుని రాజకీయంగా తయారు చేసి జిల్లా ఉద్యమాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఎనలేని కృషి చేశారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మత ఉన్మాదానికి, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో ప్రజలను, కార్మికులను, యువకులను, మహిళలను సమీకరించి నరసింహయ్య కలలు కన్న సమ సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవు తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, కార్యదర్శి వర్గ సభ్యులు కె.మహమ్మద్ గౌస్, ప్రజా సంఘాల నాయకులు వెన్న. బాల వెంకట్, సుబ్బారావు, అవుకు లక్ష్మణ్, శివతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.



టి.నరసింహయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళులర్పిస్తున్న నాయకులు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్

నమూనా పరీక్ష విజయవంతం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని మేఘన, సిద్ధార్థ, సుభాష్ చంద్రబోస్, ప్రతిభ తదితర కోచింగ్ సెంటర్లలో బుధవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించి పోలీస్ కానిస్టేబుల్ నమూనా పరీక్ష విజయవంతమయింది. ముందుగా పోలీస్ నమూనా పరీక్ష ప్రశ్నపత్రాలను డిఎస్‌పి రామాంజనేయులు విడుదల చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్ష విజయవంతంగా నిర్వహించడం అభినందనీయ మన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యతని గుర్తు చేశారు. పోటీ పరీక్షల ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం నేటి నిరుద్యోగ విద్యావంతులైన యువతి, యువకులకు అవసరమని, ఆ శక్తిని, సామర్థ్యాన్ని పెంపొందించు కోవాలన్నారు. డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ విద్యావంతులకు మోడల్ నమూనా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సామర్థ్యాన్ని ముందుగా పరీక్షించుకోవడానికి, ఒత్తిడి పోగొట్టుకోవడానికి, అవగాహన పెంచుకోవడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు వినీత్, కిరణ్, మధు, శాంతి వర్ధన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి బాట పట్టాలి

- డిఆర్‌డిఎ పిడి శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి - పాణ్యం

గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి బాట పట్టాలని డిఆర్‌డిఎ పిడి శ్రీధర్ రెడ్డి తెలిపారు. బుధవారం పాణ్యం మండల మహిళా సమాఖ్యలో ఎపిఎం ఎన్.ప్రసాద్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాణ్యం మండలంలో ఉన్న షెడ్యూల్డ్ తెగల సభ్యులకు ప్రస్తుతం బ్యాంకు లింకేజీ రుణం ద్వారా రూ. 4 కోట్లు, పొట్టేళ్లు, పెరటి కోళ్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపిపి హుస్సేన్ బి మాట్లాడుతూ మహిళలు తీసుకున్న రుణాల ద్వారా జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఇఒ, ఎంపిడిఒ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు : ఎస్‌పి

ప్రజాశక్తి నంద్యాల కలెక్టరేట్

పోలీసు రిక్రూట్మెంట్ ఎపి స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు పరీక్షలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్‌పి కార్యాలయంలో పోలీస్ అధికారులు, రీజనల్ కోఆర్డినేటర్లతో ఎస్‌పి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ నెల 22న ఆదివారం ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు నిర్వహించనున్న పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలకు కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నిబంధనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అభ్యర్థులందరూ నిబంధనలను పాటిస్తూ సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకుని, క్రమశిక్షణ పాటిస్తూ పరీక్షలను రాయాలని సూచించారు. నంద్యాల జిల్లాలో పరీక్ష రాసే అభ్యర్థులు 17,331 మంది ఉండగా 33 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నంద్యాల పట్టణంలో 28, పాణ్యంలో 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్ తో పాటు ప్రభుత్వం ధృవీకరించిన ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు, ఓటర్ కార్డ్, పాసుపోర్ట్, పాన్ కార్డ్ మొదలగు వాటిలో ఏదైనా ఒకటి తీసుకురావాలని సూచించారు. ఉదయం 10 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబోరని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్.రమణ, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, టౌన్ డిఎస్పి మహేశ్వర్ రెడ్డి, ఏఏఒ నిజాముద్దీన్, రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వి. అశోక్, ఎలక్ట్రిసిటీ డిఈ ఆంథోనీ రాజు, ఆర్టిసి డిపో మేనేజర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

- జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి - రహదారి భద్రత వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మోటారు బైక్‌లు నడిపేవారు హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి సూచించారు. బుధవారం నంద్యాలలోని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని వైఎస్ఆర్ కాన్ఫరెన్స్ హాల్‌లో 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడారు. చాలా ప్రమాదాల్లో తలకు బలమైన గాయం కావడం వల్ల ఎక్కువ మంది చనిపోయారని, అందుకు ప్రధాన కారణం హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడమేనని అన్నారు. 2019, 2020, 2021, 2022లో జరిగిన రోడ్డు ప్రమాదాలను గమనిస్తే, ముఖ్యంగా మోటారు సైకిళ్ళు, కార్లు, ఆటోలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయన్నారు. 2022లో ఎక్కువగా మోటారు సైకిళ్ళు రోడ్డు ప్రమాదాలకి గురయ్యాయని చెప్పారు. నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వలన 107, హెల్మెట్ లేకుండా 39, రోడ్డు డివైడర్‌లను గుద్దుకొని 36, అతివేగంతో 8, నిలిపి ఉన్న వాహనాలను గుద్దుకొని 6, మద్యం తాగి వాహనాలు నడపడం వలన 1, రాంగ్ రూట్‌లో 1 ప్రమాదాలకు గురయ్యాయని తెలిపారు. యువత అత్యుత్సాహం, అతివేగంగా డ్రైవింగ్ చేసి రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకోవడం బాధకరమన్నారు. నగరంలో రోజురోజుకు జనాభా పెరుగుతుందని, వాహనాలు కూడా వేల సంఖ్యలో పెరుగుతున్నాయని, కానీ రోడ్లు మాత్రం వెడల్పు కావడం లేదన్నారు. ఫలితంగా విపరీతమైన ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని తెలిపారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ విలువైన ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని వాహనాలను నడపాలన్నారు. జాగ్రత్తగా ఇళ్లకు సురక్షితంగా చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న జిల్లా ఎస్‌పి, ఎంపీ, ఎమ్మెల్యేలు

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అంజాద్ బాషా

ప్రజాశక్తి నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అంజాద్ బాషా పేర్కొన్నారు. బుధవారం నంద్యాలలో వైసిపి మండల స్థాయి కన్వీనర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జిల్లా నాయకులకు, కార్యకర్తలకు, మండల కన్వీనర్‌లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి 175 సీట్లు కనీసం చేసుకుని మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 95 శాతం అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఏ రాష్ట్రంలో కూడా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేసిన దాఖలాలు లేవన్నారు. మండల కన్వీనర్లు ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం వైసిపి జిల్లా అధ్యక్షులు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆరు ఎమ్మెల్యే స్థానాలు ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునేలా కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, గంగుల బిజేంద్రా రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, కాటసాని రామిరెడ్డి, తోగురు ఆర్థర్, నాయకులు, మండల కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంచార్జ్ మంత్రి అంజాద్ బాషా

వైసిపి నాయకులవి నీచ రాజకీయాలు

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వైసిపి నాయకులు తనను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక తన బంధువులను అడ్డుపెట్టుకొని నీచ రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. బుధవారం ఆమె తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజల మద్దతు కలిగిన తనను నేరుగా ఎదుర్కొనలేక ప్రత్యర్థులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఈ చర్యలు తనకు మరింత ఓటు బ్యాంకు పెరిగేందుకే పనికొస్తాయన్నారు. తాను ఎవరికి భయపడనని, వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. వైసిపి నాయకులు తనను లక్ష్యంగా చేసుకొని తనతో పాటు తమ కార్యకర్తలపై పోలీసుల సహాయంతో కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. టిడిపి, బిజెపి కార్యకర్తలు ఇద్దరు తాగి గొడవపడిన కేసులో తమ కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. తమ కేసును ఇంట్రెస్ట్‌గా తీసుకుని దర్యాప్తు, అరెస్టు చేయడంలో పోలీసులు సక్సెస్ అయ్యారని, తాము ఇస్తే పోలీసులు కేసు కూడా తీసుకోలేదన్నారు. తనను టార్గెట్ చేసే విషయం ప్రజలు గమనించాలన్నారు. తమ ఇంటికి ఎదురుగా ధర్నాకు దిగిన సంఘటనపై మీడియా కూడా వాస్తవాలు తెలుసుకొని రాయాలని హితవు పలికారు. తమకు జరిగిన అన్యాయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 27న టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టే పాదయాత్రకు నంద్యాల జిల్లా నుండి పెద్ద సంఖ్యలో యువత తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న అఖిలప్రియ

క్రమం తప్పకుండా నీటి శుద్ధి

- సర్పంచి డి.హుసేన్ బి గుర్రప్ప

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండలంలోని కోటపాడు గ్రామంలో క్రమం తప్పకుండా నీటిని శుద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ డి హుస్సేన్ బి గుర్రప్ప పేర్కొన్నారు. బుధవారం కోటపాడు గ్రామంలోని గ్రామీణ నీటి సరఫరా ఓవర్ హెడ్ ట్యాంక్ శుభ్రతను సర్పంచి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని క్రమం తప్పకుండా క్లోరినేషన్ ద్వారా నీటి శుద్ధి చేస్తున్నామన్నారు. శుద్ధ జల కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేసి ప్రజలకు అతి తక్కువ ధరకే శుద్ధ జలం అందిస్తున్నట్లు తెలిపారు.



తాగునీటిని శుద్ధి చేస్తున్న దృశ్యం

కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

- రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ధర్మదీక్ష
- సంఘీభావం ప్రకటించిన ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల

కృష్ణా నది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ దగ్గర రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం రాయలసీమ ధర్మదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సమితి ఉపాధ్యక్షులు వై.యన్. రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో కృష్ణానది నీటి నిర్వహణ చేయడానికి, జలాల వినియోగంపై వివాదాలను పరిష్కరించడానికి ఎపి రాష్ట్ర విభజన చట్టం-2014 ప్రకారం కృష్ణా నది యాజమాన్య బోర్డును ఎపిలో ఏర్పాటు చేయాలన్న నిబంధన వుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కృష్ణా నది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర్మదీక్షకు సంఘీబావంగా విచ్చేసిన కడప జిల్లా ప్రొద్దటూరు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధికి, సాగునీటి హక్కుల కోసం చేపట్టే ఏ ఉద్యమానికైనా సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. భారతీయ కిసాన్ సంఘ్ కడప జిల్లా అధ్యక్షులు, వైసిపి సీనియర్ నాయకుడు కర్నూలు చంద్రశేఖర్ రెడ్డి, కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు సిఎంకు రాసిన లేఖలను దశరథరామిరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన ఎపి రాష్ట్ర రైతాంగ సమాఖ్య అధ్యక్షులు చలసాని కోటిరెడ్డి, విజయవాడ కార్యదర్శి వేణుగోపాల రావు, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక అధ్యక్షులు రామక్రిష్ణారెడ్డి, అభివృద్ధి వికేంద్రీకరణ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, రాయలసీమ సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, రాయలసీమ మహాజన సభ అధ్యక్షులు డాక్టర్ నాగన్న, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ అరుణ్, పాణి, అఖిల భారత రైతు కూలీ సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు మల్లిఖార్జున, పారిశ్రామికవేత్త ఆత్మకూరు రవి, సుదర్శన్ రెడ్డి, నందిరైతు సమాఖ్య కార్యదర్శి మధుసూధనరెడ్డి, యాగంటి బసవేశ్వర స్వామి, రైతు సంఘం అధ్యక్షులు ఎంసి. కొండారెడ్డి, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి పలు ప్రజాసంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొజ్జ దశరథ రామిరెడ్డి

ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు : చైర్మన్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించే దిశగా అన్ని రకాల సదుపాయాలు కల్పించినట్లు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కాశ్యప్ అన్నారు. బుధవారం పట్టణంలోని టిబి రోడ్డులో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంకు ఖాతాదారులతో, పొదుపు సంఘాల మహిళలతో కస్టమర్ మీట్ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో రెండు ఏపీజీబీ శాఖలు ఉన్నాయని, 2022-23కు గాను ఈ రెండు శాఖలు లాభాల బాటలో నడుస్తున్నాయని తెలిపారు. రూ. 139 కోట్ల నూతన వ్యాపారం జరిగిందన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు అత్యధికంగా 7.75 శాతం వడ్డీ చెల్లిస్తున్నట్లు తెలిపారు. డిజీ అకౌంట్ పేరుతో ఇంట్లో ఉండే ఖాతా ప్రారంభించవచ్చన్నారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ మేనేజర్ పిఎస్ నవీన్ కుమార్, ఆళ్లగడ్డ బ్యాంకు మేనేజర్‌లు బి.నందకిషోర్, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్

విజయ పాలడైరీ యాజమాన్యం మొండివైఖరి వీడాలి

- వైఎస్ఆర్ విగ్రహం ముందు సిఐటియు నిరసన

ప్రజాశక్తి - నంద్యాల

విజయ పాల డైరీ యాజమాన్యం మొండి వైఖరిని వీడి అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సాయిబాబా నగర్‌లోని వైయస్సార్ విగ్రహం ముందు సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షుడు డి. లక్ష్మణ్ అధ్యక్ష వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట. మద్దులు, పట్టణ కార్యదర్శి కేయండి.గౌస్, జిల్లా సహాయ కార్యదర్శులు వెన్న బాల వెంకట్‌లు మాట్లాడారు. విజయ పాలు డైరీలో జరుగుతున్న అక్రమాలు వెలికితీస్తారనే భయంతోనే యూనియన్ పెట్టుకున్నార నెపంతో 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులను తొలగించడం దారుణమన్నారు. గత నాలుగు నెలలుగా అనేక రూపాల్లో ఆందోళన చేస్తున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. లేబర్ అధికారులు ఎవరి కోసం పని చేయడానికి ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. అకారణంగా తొలగించిన కార్మికులను వెంటనే విధులకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ముందు నిరాహార దీక్షలకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సుబ్బారావు, సత్యం, ప్రసాదు, సుబ్బయ్య, ప్రభాకర్, నాగరాజు, హమాలీలు, కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

పేదల పాలిట పెన్నిధి ఎన్‌టిఆర్

- మాజీ మంత్రి ఫరూఖ్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి - ఎన్‌టిఆర్ విగ్రహానికి ఘనంగా నివాళ్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పేదల పాలిట పెన్నిధిగా నందమూరి తారక రామారావు చరిత్రలో నిలిచిపోయారని మాజీ మంత్రి ఎన్ఎండి.ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం నంద్యాలలోని శ్రీనివాస సెంటర్ వద్ద ఆయన విగ్రహానికి వారు అభిమానులు, కార్యకర్తలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నంద్యాలలోని తులసివనంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి ఫరూక్ ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సోదరుడు టిడిపి నాయకులు బిసి రామనాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు .అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్, వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, బీసీ సెల్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణానాయక్, మండల అధ్యక్షులు పివి కుమార్ రెడ్డి, తెలుగు యువత నాయకులు కాట్రేడ్డి మల్లికార్జున రెడ్డి, పట్టణ ఉపసర్పంచి బురానుద్దీన్, పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, మండల ట్రెజరర్ ఖాదర్ బాషా, తెలుగు యువత నాయకులు పవన్ కుమార్ రెడ్డి, నాయకులు రాయలసీమ సలాం, టిప్ టాప్ కలాం ,లాయర్ నాగేంద్ర రెడ్డి, యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళేశ్వర రెడ్డి, జోలాపురం తిరుమలయ్య ,ఇల్లూరు కొత్తపేట మాజీ సర్పంచ్ వెంకట సుబ్బారెడ్డి , అల్తాఫ్ హుస్సేన్ ,పసుపల షేక్షావలి, కామేష్ , వేములపాడు గుర్రప్ప, మంగంపేట శ్రీనివాసులు, చిన్నరాజుపాలెం నరసింహం, రామాంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఉయ్యాలవాడ :** ఉయ్యాలవాడలోని బస్టాండు సమీపంలో ఉన్న నర్సింహారెడ్డి, బుడ్డా వెంగ రెడ్డి విగ్రహాల దగ్గర నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టిడిపి మండల నాయకుడు కూడాల నారాయణరెడ్డి, బోరెడ్డి శేఖర్ రెడ్డిలు నివాళులర్పించారు. పుచ్చకాయ పల్లి సర్పంచ్ నరేంద్ర, మండల నాయకులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** టిడిపి కార్యాలయంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, గడ్డం రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు అమడాల మద్దిలేటిలు ఎన్టీఆర్ చిత్రపటానికి (మిగతా 6లో..)



నంద్యాలలో నివాళ్ల లర్పిస్తున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే



బనగానపల్లె : నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ముగిసిన సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు అశ్వవాహన సేవతో బుధవారం ముగిశాయి. ఈ నెల 12వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఏడు రోజులపాటు నిర్విఘ్నంగా జరిగాయి. 18న ముగింపు రోజున స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు పుష్ప ఉత్సవం శయ్యోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.


పనులను పరిశీలిస్తున్న ఇఒ

పార్కింగ్ ప్రదేశాల్లో లెవెలింగ్ పనులు వేగవంతం : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న పనులలో పార్కింగ్ ప్రదేశాలలో లెవెలింగ్ పనులు వేగవంతం చేయాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఫిబ్రవరి 11వ తేదీ నుండి 21వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా వివిధ ఏర్పాట్ల పనులను అధికారులతో కలిసి పార్కింగ్ ప్రదేశాలను బుధవారం పరిశీలించారు. ఆయా ప్రదేశాలలో ఉన్న బండరాలను తొలగించి పార్కింగ్ ప్రదేశాలను చదును చేయాలని సూచించారు. మంచినీరు, విద్యుత్తు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలని కరపత్రాలను ముద్రించాలని సూచించారు. అనంతరం గణేష్ సదన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి రామకృష్ణ, దేవస్థానం ఏఈఓ పనిధర్ ప్రసాద్, ఐఎన్ వి మోహన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారెడ్డి, శ్రీశైల ప్రభ ఎడిటర్ డాక్టర్ సి అనిల్ కుమార్, పర్యవేక్షకులు అయ్యన్న, ఉద్యానవన విభాగం అధికారి లోకేష్, తదితరులు ఉన్నారు.

ఎస్ఐ రమణయ్య బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - చాగలమర్రి



చాగలమర్రి ఎస్ఐగా రమణయ్య బుధవారం నాడు తిరిగి బాధ్యతలు చేపట్టారు. నవంబర్ నెల నుండి దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళిన ఎస్ఐ జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు తిరిగి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకో వాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహన దారులు సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

అంగళ్లకు వేలం పాట

ప్రజాశక్తి - గడివేముల


వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలోని శ్రీ దుర్గా భోగేశ్వరస్వామి దేవస్థానం నందు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దుకాణాల ఏర్పాటుకు బుధవారం వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, పర్యవేక్షణ అధికారి రవి కిరణ్ కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంవత్సరం రూ.1,40,000ల వేలం పాట వేశారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం రూ.66 వేల 200లు ఆదాయం వచ్చిందని ఆలయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్ శర్మ, గిరిధర్ శర్మ, ఆలయ సిబ్బంది రమణ, తదితరులు పాల్గొన్నారు.

మందుల విక్రయాలు నిలిపివేత

ప్రజాశక్తి - చాగలమర్రి

ఎరువులు, పురుగుల మందులు విక్రయించే దుకాణాదారులు సరైన పత్రాలు లేకపోతే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ హెచ్చరించారు. బుధవారం నాడు పట్టణంలోని చింతల చెరువు రస్తాలో గల శ్రీ సాయి శ్రీనివాస ట్రేడర్స్ పురుగుల మందుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో రూ. 94 వేల విలువ చేసే పురుగుల మందులను సరైన పత్రాలు లేక పోవడంతో వాటి విక్రయాలను 7 రోజుల పాటు నిలిపేశారు. పత్రాలు లేకుండా అమ్మకాలు జరిపితే స్టాకును సీజ్ చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

సిపిఐ పోరుబాట గోడ పత్రిక విడుదల

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో సిపిఐ పోరుబాట గోడ పత్రికను సిపిఐ నాయకులు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జగనన్న కాలనిలలో నిర్మాణం చేపడుతున్న ఇండ్ల తక్షనమే రూ5లక్షలు చెల్లించాలన్నారు. వైసిపి ప్రభుత్వ ఇచ్చే రూ1,80 లక్షలు చాలక ఇంటినిర్మాణానికి పేదలు అప్పులు చేస్తురని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 22వ తేదిన చలో విజయవాడ మహాధర్నకు అత్యదికం సంఖ్యలో ప్రజలు హజరై విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ


ప్రజల నుండి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గంగుల


పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్


పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ లోని 5వ సచివాలయం పరిధిలోని యేసునాథపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్.వి జగన్ మోహన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ కంబగిరి, హౌసింగ్ ఏఈ నరసింహ, కౌన్సిలర్లు గొట్లూరు సుధాకర్ రెడ్డి, బాలబ్బి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు సురేంద్రనాథ్ రెడ్డి, వైసిపి నాయకులు దామోదర్ రెడ్డి, రఘు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** మండలంలోని గుంతనాల, ఎ.శివరామపురం, బి.శివ రామపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. 10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఎంపీపీ శెట్టి ప్రభాకర్, సర్పంచి గాలి సరోజ, గాలి సురేంద్రారెడ్డి గారి రాజారెడ్డి, పుల్లారెడ్డి, వేణుగోపాల్, నాయకులు పోలూరు మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు. **పాములపాడు :** ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. బుధవారం మద్దూరు గ్రామంలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ప్రతి ఇంటికి తిరిగి ప్రజలకు అందుతున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఆయన అన్నారు. గ్రామస్తులు కొంతమంది హౌసింగ్ సమస్యను తీసుకొచ్చారు తక్షణమే పరిష్కరించాలని హౌసింగ్ ఏ ఈకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆక్తరున్ని సా, ఎంపీటీసీ బషీర్ అహ్మద్, తహశీల్దార్ రత్న రాధిక, వైసిపి నాయకులు రామలింగేశ్వర్ రెడ్డి, చౌడయ్య, బాలీశ్వర్ రెడ్డి, రమణారెడ్డి, జబ్బార్, ఉపేంద్ర, రమణ, రాజన్న స్వామి, దాసు, శివలింగం పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : టిడిపి

ప్రజాశక్తి - చాగలమర్రి


వనిపెంటలో వైసిపి నుండి టిడిపిలోకి చేరిన కాలనీ వాసులు


అల్లూరులో ఇదేమి కర్మ ప్రచారం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన చేస్తోందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమా అఖిలప్రియ ఆరోపించారు. మండలంలోని డి వనిపెంట గ్రామంలో బుధవారం ఇదేంఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అన్ని వర్గాల వారికి తీరని అన్యాయం చేసిందన్నారు. అభివృద్ధిని గాలికి వదిలేసి దౌర్జన్యాలకు, అక్రమ కేసులకు, తెదేపా నాయకులపై దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగ అవకాశాలు లేక పక్కరాష్ట్రాలకు కూలీ పనులకు వెళ్లే దౌర్భాగ్యస్థితి నెలకొందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి మైనార్టిసెల్ ఉపాధ్యక్షులు అన్సర్బషా, టీఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తినరసింహులు, నంద్యాల బీసీసెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు, మైనార్టి నాయకులు కొలిమి ఉసేన్ వలి, నాయకులు గోపాల్, దస్తగిరి, బాబునాయుడు, బాలయ్య, గంగయ్య నాయకుడు, బాలనరసింహుడు, ఈశ్వర్రెడ్డి, సుబ్బయ్య, పాములేటి, బాలస్వామినాయక్, ఇండ్ల లక్ష్మిరెడ్డి, రమణారెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి చేరికలు : డి. వనిపెంట గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన నరసింహులు, ప్రభాకర్, బాలన్న, ప్రతాప్, సురేష్, యశోద, పామన్న కుటుంబాలు వైకాపా వీడి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో తెదేపాలోకి చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైకాపా పాలన నచ్చకే ధైర్యంగా తెదేపాలోకి చేరారని తెలిపారు. అలాగే గతంలో తెదేపాను వీడి వైకాపా చేరినవారు తిరిగి పార్టీకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని తెలిపారు. **నందికొట్కూర్ :** వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగిందేమి లేదు అని జిల్లా టిడిపి ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. తన సొంత గ్రామమైన అల్లూరు గ్రామంలో ఇదేమి కర్మ కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ కరెంటు చార్జీలు, నిత్యవసర సరుకులు ధరలు, గ్యాస్ ధరలు భారీగా పెరిగాయని, ఏ విధమైన లబ్ధి జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మయ్య, మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, మాండ్ర రత్నాకర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, తిమ్మారెడ్డి, జయ సూర్య, గొల్ల మని, గొల్ల తిరుపతయ్య, సాంబశివుడు, లక్ష్మన్న, బాలకృష్ణ, బలరాముడు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, చిన్న రాజు, మహేష్, తలారి ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రీడాకారులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



మాట్లాడుతున్న శ్రీనివాసులు యాదవ్

క్రీడాకారులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి, రాష్ట్ర దేశ స్థాయిలో పాల్గొని మంచి పేరు తీసుకురావాలని పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాసులు యాదవ్ అన్నారు. నంద్యాల జిల్లా క్రీడాపాధికార సంస్థ, జిల్లా పుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రస్థాయి శాప్ పుట్‌బాల్ ఫేస్-2 క్రీడా పోటీలు స్థానిక ఎస్పీజీ కళాశాల క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసులు యాదవ్, ఎస్‌పిజి కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, స్టేట్ కన్వీనర్ మహమ్మద్ సిరాజుద్దీన్‌లు హాజరై ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల జట్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. కార్యక్రమంలో పుట్‌బాల్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు, సిబ్బంది, పిడిలు పాల్ విజయ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్, శిక్షకులు పాల్గొన్నారు.


పులిజాడలు పరిశీలిస్తున్న ఎఫ్‌ఎస్‌ఓ

పులి సంచారంపై ఆందోళనొద్దు : ఎఫ్‌ఎస్‌ఒ

ప్రజాశక్తి - కొత్తపల్లి

నల్లమల అడవుల్లోని జానాల గూడెం బల పాలతిప్ప ప్రజలు పులి సంచారంపై ఆందోళన చెందవద్దని ఎఫ్ఎస్ఓ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని జానాల గూడెం బలపాలతిప్ప గ్రామాల సమీపంలో ఫారెస్ట్ అధికారులతో పులిజాడలపై ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులి జాడలు కానీ, తిరిగినట్టు ఆనవాలు కానీ లేవన్నారు. రెండు గ్రామాల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఫారెస్ట్‌లో జంతువుల రాకపోకలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక కెమెరాలను కూడా పరిశీలించడం జరిగిందన్నారు. సమాచారం ఉంటే వెంటనే ఫారెస్ట్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ తనిఖీల్లో ఫారెస్ట్ సిబ్బంది పాములేటి పలువురు ఉన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపు

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని నేటి నుంచి ఆధార్ నమోదు క్యాంపును నిర్వహిస్తునట్లు ఎంపిడిఒ వెంకటరమణ తెలిపారు. బుధవారం ఎంపిడిఒ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదిన ఎం ఘణపురం,ఎన్ ఘణపురం గ్రామ పంచాయతీ పరిదిలో, 20న ప్రాతకొట,21న లక్ష్మాపురం,23న పగిడ్యాల, 24న సంకిరేణిపల్లే గ్రామ పంచాయతీలలో ఆధార్ మొబైల్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు.

బోట్ల ప్రయాణం చేయకుండా చూడాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

కృష్ణానదిలో ఆంధ్ర నుంచి తెలంగాణకు సింగోటం జాతరకు వెళుతున్న ప్రయాణికులను బోట్ల ప్రయాణం ఎవ్వరు చేయకుండా రెవెన్యూ పోలీసులు చూడాలని తహశీల్దార్ చంద్ర శేఖర్ నాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని సంగమేశ్వరం, సిద్దేశ్వరం గ్రామాల సమీపంలో ఉన్న బోట్ల ఘాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కృష్ణా నదిలో తిరుగుతున్న బోట్లని నిషేధించడం జరిగిందన్నారు. సింగోటం జాతరకు వెళ్లాలనుకున్న భక్తులందరూ ఆర్టీసీ బస్సుల్లో వెళ్లి రావాలని తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిఒచారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శేషారాం సింగ్, పోలీసులు సుదర్శన్, వీఆర్వో అశోక్ రహిమాన్, పలువురు ఉన్నారు.

ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండాలి

- ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడు నాగసత్యనారాయణ

ప్రజాశక్తి - గడివేముల


మాట్లాడుతున్న ఆర్యవైశ్య నాయకులు

ఆర్యవైశ్యులందరూ ఐఖ్యమత్యంగా ఉండాలని ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడు నాగ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రమైన గడివేములలోని స్థానిక వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయం నందు ఆర్యవైశ్య టౌన్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకోబడిన బొంతల మధుసూదన్ గుప్తాకు జిల్లా అధ్యక్షులు నాగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ గుప్తా, కార్యదర్శి భీమిశెట్టి మురళి కృష్ణ బుధవారంనాడు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి చిన్న చిన్న వ్యాపారాలు చేసి జీవనం సాగిస్తున్నా వారికి ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ప్రతి మండలనికి ఆర్యవైశ్య సంఘాలు ఏర్పాటు చేసి నిరుద్యోగులు, పేదవారిని గుర్తించి ఆర్యవైశ్య చారిటబుల్ ట్రస్ట్, కార్పొరేషన్ నుండి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రభుత్వం వారికి సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. పేదలను గుర్తించి ఈబీసీ సర్టిఫికెట్ అందించాలిన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సోదరులు సీవీ రమణయ్య, ఈపూరి పద్మనాభం, గుటూరు వేంకటేశ్వర్లు, రమేష్, సురేష్,కృష్ణమూర్తి,సుధాకర్,రాఘవేంద్ర,సుమన్,రాజు,లక్ష్మి నారాయణ, సాయి,శ్రీనివాసులు, ఆర్యవైశ్య సోదరులు పాల్గొన్నారు.



టి నరసింహయ్య చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

టి నరసింహయ్య ఆశయ సాధనకు కృషి : సిపిఎం

ప్రజాశక్తి - బేతంచెర్ల

తెలకపల్లి నరసింహ ఆశయం సాధనకు సిపిఎం ప్రతి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సిపిఎం బేతంచెర్ల పట్టణ కార్యదర్శి నాయకులు వైబి వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్ నాయకులు వై ఎల్లయ్య అన్నారు. టి నరసింహయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా బేతంచెర్ల సిపిఎం కార్యాలయం నందు పార్టీ నాయకులు శోభారాణి, రామాంజనేయులు అధ్యక్షతన నరసింహ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టి నరసింహయ్య ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని యువకులను కలుసుకొని ఉద్యమ పాఠాలు నేర్పించి, ఉద్యమాన్ని నడిపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జె శ్రీనివాసులు, ఎస్‌పి కలాం, రాజబాబు, ఎస్ గుల్జార్టీ, నాగేంద్రమ్మ, సంజీవ నాయుడు, వెంకటరమణ, నాగరాజు, జాకీర్, హుస్సేన్, ఎస్ మా బాష, హసన్ బాష, విష్ణు, నారాయణ, నరసింహ, బాలకృష్ణ, పోలూరు బాష, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

ప్రభుత్వ నిబంధనల మేరకే మద్యం అమ్మకాలు జరగాలని జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎం రవి కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం బేతంచెర్ల మండల కేంద్రంలోని డోన్ రోడ్ లోని వైన్ షాపు, సత్రం దగ్గర, కొత్త బస్టాండ్, కర్నూల్ రోడ్‌లోని హెవెన్ బార్ అండ్ రెస్టారెంట్‌లలో ఎక్సైజ్ అధికారి రవికుమార్ రెడ్డి తన సిబ్బందితో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. షాపులలో శుభ్రత నాణ్యమైన విధంగా సరుకు ఉంచుకోవాలన్నారు. కల్తీ నకిలీ మద్యం ఉన్నాయా లేక వేరే విధంగా అక్రమ మద్యం విక్రయించడం జరుగుతుందా అని రసాయనాలు పరీక్షలను చేసి పరీక్ష నమూనాలను సేకరించి నమూనా కేంద్రాలకు పంపించారు. సమయపాలన తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎం అస్లాంబిగ్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, సిబ్బంది శివనాగిరెడ్డి, ఎక్సైజ్ కానిస్టేబుల్ కల్పన, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

28న చలో సిద్దేశ్వరం

ప్రజాశక్తి - పగిడ్యాల

ఈ నెల 28న నిర్వహిస్తున్న చలో సిద్దేశ్వరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటి సభ్యులు చిన్న సుంకన్న, నాగన్న అన్నారు. బుధవారం మండంలోని ముచ్చుమర్రి,నెహ్రునగర్,ఆంజనేయనగర్,పగిడ్యాల, ప్రాతకొట గ్రామలో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సిద్దేశ్వరం వద్ద తీగల వంతెన నిర్మించాకుండా బ్యారేజి వంతే నిర్మాణం చేపట్టాలన్నారు. బ్యారేజి వంతే నిర్మాణ చేపడితే సాగు నీరు, తాగు నీరు మనకు నిత్యం సరఫరావుతాయన్నారు. జయేంద్ర,శివరాముడు, తెలుటు దుబ్బన్న,రంగడు,రాజు,స్వాములు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి రహదారి ఏర్పాటు చేయాలి : సిపిఐ ఎంఎల్

ప్రజాశక్తి-డోన్

దొరపల్లె గ్రామంలో జగనన్న కాలనీకి రహదారి ఏర్పాటు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగనాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఆర్ఓ పుల్లయ్యకు బుధవారం నాడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత అధికారులు సమస్యని గుర్తించి త్వరగా రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు దొరపల్లె రాజు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు రాంబాబు, ఐఎఫ్‌టియు నాయకురాలు సులోచన, లక్ష్మి పాల్గొన్నారు.


సిబ్బందితో సమవేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

'ఉపాధి'ని ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - బేతంచెర్ల

జాతీయ ఉపాధి హామీ పథకం పనులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డోన్ నియోజకవర్గ ఎపిడి శ్రీవిద్య అన్నారు. మండల పరిధిలోని బుగ్గానపల్లె తండా గ్రామంలో బుధవారం ఎపిడి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికీ పనులకు కల్పించాలన్నారు. సగటున రెండు వందల యాభై ఏడు రూపాయలు పొందే విధంగా పనిచేయాలని అన్నారు. తనిఖీ నిర్వహ ణలో భాగంగా ఏపీవో శేషన్న, గ్రామ నాయకులు వెంకటేష్ నాయక్, ఆదిలక్ష్మి, భాయ్, శివ, సురేష్ నాయక్ రాముడు నాయక్, తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** పని కావాలని అడిగిన ప్రతి కూలికి ఉపాధి హామీ పని కల్పించాలని ఎంపిడిఒ వెంకటరమణ టిఎలకు, ఎఫ్ఎలను సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహిఒచారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. జాబ్ కార్డుకు ఆధార్ కలిగిన ప్రతి కూటుంబానికి అనుసందనాం చేయలన్నారు. ఎపిఒ మద్దిలేటి, టిఎలు.ఎఫ్‌ఎలు పాల్గొన్నారు.

పేదల పాలిట పెన్నిధి ఎన్‌టిఆర్

(5వ పేజీ తరువాయి..) నివాళులర్పించారు. గడ్డం అమర్నాథరెడ్డి, నాగూర్, నాగేంద్ర, రఫీ, రాజు, కేశవరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం బనగానపల్లె నియోజకవర్గంలో రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. **మహానంది :** మహానందిలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, మండల అధ్యక్షులు ఉల్లి మధు, నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. **కొలిమిగుండ్ల :** టిడిపి కార్యాలయంలో కోటపాడు శివరామిరెడ్డి, నంద్యాల ప్రసాద్, బందార్లపల్లె యాతం కళ్యాణ్ రెడ్డి, యాతం చంద్రహాస్ రెడ్డి, ఇటిక్యాల శివారెడ్డిలు ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించారు. మందా విజయ్, అంజి, వెంకటేష్ పాల్గొన్నారు. **పాణ్యం :** మండల నాయకులు జయరాం రెడ్డి, లాయర్ బాబు, ఎంపీటీసీ రంగ రమేష్, రమణమూర్తి, రాంపుల్లారెడ్డి, మాజీ సర్పంచ్ బాలన్న, ఖాదర్ భాషా, సురేష్, రవి, శేఖర్ రెడ్డి, గుజ్జల సుబ్బయ్య, శివ శంకర్ రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు. **నందికొట్కూరు :** ఎన్‌టిఆర్ వర్ధంతిని వెంకటేశ్వర కళ్యాణ మండపం వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం అధికార ప్రతినిధి డాక్టర్ కాకర వాడ చిన్న వెంకటస్వామి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుండం రమణారెడ్డి, మాజీ మండలాధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, నియోజకవర్గం పోల్ కోఆర్డినేటర్ మహేష్ నాయుడు, పట్టణ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షకీల్ అహ్మద్, ఐటీడీపీ అధ్యక్షులు ముతుజావలి, లీగల్ సెల్ నాయకులు జాకీర్, బీసీ సెల్ అధ్యక్షులు వేణుగోపాల్, ఎస్సీ సెల్ నాయకులు జై సూర్య, బోల్లెద్దుల రాజన్న, తెలుగు యువత అధ్యక్షులు రవీంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి మొహిద్దీన్, విజయ్ యాదవ్, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు కుమార్ బ్రహ్మ ముత్తు సతీష్, ప్రవీణ్, తదితరులు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం నందికొట్కూరు పట్టణ నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. **ఆత్మకూర్ :** ఆత్మకూరు టిడిపి కార్యాలయంలో లెజెండరీ బ్లడ్ క్యాంప్‌ను మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బుడ్డా మాట్లాడుతూ ఆడవారికి ఆస్తిలో సగం హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి ఎన్‌టిఆర్ అన్నారు. శ్రీశైలం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ వంగాల శివరామి రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పస్పిల్ మున్నా, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగూర్ ఖాన్, పట్టణ టీడీపీ అధ్యక్ష,ప్రధాన కార్యాదర్శులు వేణుగోపాల్,బాషా, వెన్న శ్రీధర్ రెడ్డి, రాజా రెడ్డి,అబ్దుల్ హుస్సేన్,ముత్తు,రామమూర్తి, సతీష్,సుబ్బరాజు,ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జునైద్ బాషా పాల్గొన్నారు. **డోన్ :** నందమూరి తారక రామారావు ఆంధ్ర ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదికున్నారని డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు అధ్యక్షతన తారకరామనగర్ నందు పార్టీ కార్యాలయం దగ్గర ఎన్‌టిఆర్ విగ్రహానికి నాయకులతో కలసి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం లెజెండ్ రక్తాదాన శిబిరం ఏర్పాటు చేశారు. రాష్ట్ర టిడిపి కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ ఎంపీపీ ఆర్.ఈ.రాఘవేంద్ర, రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, డోన్ నియోజకవర్గ సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి విజయ్ భట్, జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లిఖార్జున, తదితరులు పాల్గొన్నారు. **గడివేముల :** స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతిని మండల టిడిపి నాయకులు దేశం సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రవణమ్మ, మాజీ జెడ్పిటిసి బి సీతారాం రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు దామోదరం నాగశేషులు, నాయకులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచెర్ల నగర పంచాయతీ టిడిపి కార్యాలయం నందు శిక్షావల్లి చౌదరి ఆధ్వర్యంలో, ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఎర్ర నాగయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తిరుమలేష్ చౌదరి, ఉన్నం చంద్రశేఖర్ చౌదరి, గూటం శివ, వల్లెంపాడు వెంకటేశ్వర్లు, వలసల ఈశ్వరయ్య, నాయకులు పాల్గొన్నారు. **చాగలమరి :** ఎన్టీఆర్ ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తామని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్అన్సర్ బాష అన్నారు. స్థానిక మెయిన్ బజార్‌లోని టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టిడిపి బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు, తెలుగు నాడు రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, పట్టణ ఉపాధ్యక్షులు షాబుల్ ముల్లా అజీమ్, ఆలంశ గారి మౌలాలి, ప్రచార కార్యదర్శి ముల్లా గఫార్, బషీర్, జెట్టి నాగరాజు, కామిశెట్టి రమేష్ పాల్గొన్నారు. **బండి ఆత్మకూరు :** మండల టిడిపి నాయకులు కంచర్ల సురేష్ రెడ్డి, నందిపాటి నరసింహారెడ్డి, బొల్లవరం మల్లేశ్వర్ రెడ్డి బస్టాండ్ ఆవరణంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మైనార్టీ నాయకులు జాకీర్ ఖాన్, లక్ష్మిరెడ్డి, బుగ్గ రాముడు, లింగాపురం సర్పంచ్ బాబు, చంద్రుడు, ఇస్మాయిల్, అంజలి, నాగేశ్వరావు పాల్గొన్నారు. **ప్యాపిలి :** యువకిశోరం ధర్మవరం గౌతంరెడ్డి, లక్ష్మి నారాయణ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, రామసుబ్బయ్య, సుంకయ్య, రామ్మోహన్ యాదవ్, గండికోట రామాంజనేయులు, కాజాపీర్‌లు స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మల్లికార్జు న, శ్రీనివాసులు, బాలరంగన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.


మహానందిలో..


కోవెలకుంట్లలో..


నందికొట్కూరులో..



ఆత్మకూరులో..


ఉయ్యాలవాడలో..


బండి ఆత్మకూరులో..


ప్యాపిలిలో..


డోన్‌లో..